మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 19-9-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 | సంచిక: 81 Issue: 81

19 సెప్టెంబర్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:11 తిథి అష్టమి మ. 3:26 వరకు తరువాత నవమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం మూల రా. 1:34ం వరకు తరువాత పూర్వాషాఢ యోగం ఆయుష్మాన్ మ. 2:27 వరకు కరణం బవ మ. 3:26 వరకు భాలవ తె. 4:40ం వరకు వర్జ్యం ఉ. 7:43 నుండి ఉ. 9:31 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:33 వరకు రాహుకాలం ఉ. 9:09 నుండి ఉ. 10:39 వరకు యమగండం మ. 1:40 నుండి మ. 3:10 వరకు గుళికాకాలం ఉ. 6:08 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు సా. 6:36 నుండి రా. 8:24 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:34 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## '22ఏ'పై హైలెవెల్ కమిటీ

### ముగ్గురు అధికారులతో ఏర్పాటు.. ఫాస్ట్ ట్రాక్‌గా సమస్యల పరిష్కారం



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): 22ఏ భూముల సమస్యల పరిష్కారం దిశగా తొలి అడుగు వేసింది. ముగ్గురు అధికారులతో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో ఈ కమిటీని ఏర్పాటు చేయగా.. కమిటీ ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్.. సభ్యులుగా లా సెక్రటరీ పాపిరెడ్డి, ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతులను నియమించారు. తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 22ఏ భూముల గురించి చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని తరువాయి 2 వ పేజీలో...

## 388 ఎకరాలపై ఫోకస్!

### కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ రెండోరోజూ సర్వే

### 3 గ్రామాల సరిహద్దుల్లోని భూముల గుర్తింపు, పరిశీలన

### పాత రైతుల వివరాలు, రెవెన్యూ రికార్డుల సేకరణ



సిద్దిపేట, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల భూ సర్వే రెండో రోజూ కొనసాగింది. సిద్దిపేట జిల్లా మార్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలోని ఫామ్‌హౌస్‌ను ఆనుకొని ఉన్న భూములను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజపూర్ గ్రామాల సరిహద్దుల్లో తరువాయి 2 వ పేజీలో...

## మా ఆస్తులన్నీ తీసుకొని 1,000 కోట్లు ఇవ్వు..

### రేవంత్‌కు కేటీఆర్ సవాల్



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను తరువాయి 2 వ పేజీలో...



## ఆర్టీసీలో ఎన్నికల హారన్

### అక్టోబర్ 9న పోలింగ్, 17న ఓట్ల లెక్కింపు

### ఆర్టీసీ ఎన్నికల పూర్తి షెడ్యూల్ విడుదల

### 2016లో చివరిసారిగా జరిగిన ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కార్మికులు ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్న గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఎట్టకేలకు విడుదలైంది. ఈ ఎన్నికల నిర్వహణ కోసం కార్మిక సంఘాలు దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో, యాజమాన్యం ఎట్టకేలకు తేదీలను ఖరారు చేసింది. అక్టోబర్ 9న పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 17న ఫలితాలను వెల్లడించనున్నారు. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబర్ 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి. వాస్తవానికి 2018లోనే ఈ ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, అప్పటి ప్రభుత్వం వీటిని జరపలేదు. దీంతో కార్మికుల నిరీక్షణ సుదీర్ఘంగా కొనసాగింది. ఈ ఎన్నికల్లో విజయం సాధించి గుర్తింపు పొందే సంఘానికే కార్మికుల వేతనాలు, బోనస్‌లు, డీఏ, సర్వీస్ నిబంధనల వంటి కీలక అంశాలపై యాజమాన్యంతో మరియు ప్రభుత్వంతో అధికారికంగా చర్చలు జరిపే హక్కు ఉంటుంది. అందుకే ఈ తరువాయి 2 వ పేజీలో...



# బీఆర్ఎస్ వేట.. దానంపై వేటు



## స్పీకర్.. తప్పు చేశావయ్యా!

### దానం నాగేందర్ అర్హుడు ఎలా అయ్యాడు?

### 2024 ఏప్రిల్ 23 నుంచే ఆయన ఎమ్మెల్యే కాదు

### తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. ఆయన విషయంలో.. స్పీకర్ ప్రకటించిన తీర్పును కొట్టివేసింది. దానం.. ఎమ్మెల్యేగా అర్హుడంటూ.. స్పీకర్ వెలువరించిన తీర్పు ఘోర తప్పిదమని చెప్పింది. ఆయన ఎంపీగా నామినేషన్ వేసిన తేదీ 2024 ఏప్రిల్ 23 నుంచే అమల్లోకి వస్తుందని తీర్పు వెలువరించింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): శుక్రవారం.. చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ ఘౌస్ మీరా మొహియోద్దీన్‌లతో కూడిన తెలంగణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఈ సంచలన తీర్పును ప్రకటించింది.. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఆ తర్వాత కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ తరువాయి 2 వ పేజీలో...



సత్యమేవ జయతే. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన దానం నాగేందర్‌పై హైకోర్టు అనర్హత వేటు వేసింది. త్వరలో మిగతా ఫిరాయింపుదారులకూ ఇదే గతి పడుతుంది.– కేటీఆర్



హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా. ఉపఎన్నికలు వస్తే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రస్తుతానికి సుప్రీంకోర్టును ఆశ్రయించే ఆలోచన లేదు. రాజకీయాల్లో పోరాటాలు నాకు కొత్తేమీ కాదు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ఈ స్థాయికి వచ్చా.
- దానం నాగేందర్

## బంగారం-వెండి ధరలు



బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,442 |
| వెండి (కిలో): | రూ.2,,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,512 |

## విశ్వవాణి



ఉత్తర కొరియా నిర్వహించిన భూగర్భ అణు పరీక్షల కారణంగా మౌంట్ మంటప్ పర్వతం పరిసర ప్రాంతాల్లో ఏకంగా 1,399 భూకంపాలు సంభవించినట్లు శాస్త్రవేత్తల తాజా పరిశోధనలో తేలింది. ఉత్తర కొరియా గతంలో జరిపిన అణు బాంబు పేలుళ్ల అక్కడి భూగర్భ పొరలను తీవ్రంగా దెబ్బతీశాయి. దక్షిణ కొరియాలోని పుసాన్ నేషనల్ యూనివర్సిటీ, చైనాలోని చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు 2008 నుంచి 2025 మధ్య కాలానికి సంబంధించిన భూకంప తరంగాల డేటాను విశ్లేషించి ఈ విషయాన్ని గుర్తించారు.



## 9 లక్షల ఇళ్లు ఇవ్వండి

### ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సాయం చేయండి

### కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌కు సీఎం రేవంత్ వినతి

రాష్ట్రంలో ఉన్న డిమాండ్ మేరకు 9.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని మదాపూర్‌లో కేంద్ర మంత్రిని కలిసిన సీఎం.. మొదటి విడతగా రాష్ట్రానికి పీఎం ఆవాస్ యోజన కింద 2 లక్షల ఇండ్లను కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలకు ఇండ్లు మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి గత జూలైలో కేంద్రమంత్రికి ఢిల్లీలో వినతి పత్రం అందించారు. 2 లక్షల ఇళ్లు కేటాయించిన నేపథ్యంలో మిగిలిన 9.56 లక్షల ఇండ్లను కేటాయించాలని తాజా భేటీలో కోరారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, పరిస్థితుల గురించి సైతం కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో తాగునీరు, విద్యుత్ తరువాయి 2 వ పేజీలో...

## గొంతు తడిపాకే..!

### ఆ తర్వాతే బీళ్లకు నీళ్లు.. లభ్యతను బట్టి అందిస్తాం

### కృష్ణా, గోదావరి బేసిన్లలో 241 టీఎంసీలే

### 44,034 చెరువుల్లో నిండినవి 18 శాతమే

### ఎల్‌నినోపై చర్చలో మంత్రి ఉత్తమ్



రాష్ట్రంలో కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతంలో ఆ నదీ జలాలపై ఆధారపడి ఉన్న 48.58 లక్షల ఎకరాల ఆయకట్టు కు ఆచితూచి నీటిని విడుదల చేస్తామని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటి ఉన్నందున ఈ సారి ప్రభుత్వం తాగునీటికే ప్రాధాన్యం ఇస్తున్నదని వెల్లడించారు. మిషన్ భగీరథ అవసరాలు తీరిన తర్వాతే.. నీటి లభ్యత ఆధారంగా అవసరమైన చోట పంటలకు నీటిని విడుదల చేస్తామని తెలిపారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఎల్ నినో వల్ల రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల నేపథ్యంలో శాసన సభలో శుక్రవారం ప్రత్యేక చర్చ జరిగింది. ఈ చర్చలో భాగంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రాష్ట్రంలో ఉన్న నీటి నిల్వలపై సమగ్రంగా సభకు సమాచారాన్ని అందించారు. సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కృష్ణా, గోదావరి బేసిన్లలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు అడుగంటి పోయాయని తెలిపారు. "మొత్తం 585 టీఎంసీల నిల్వ సామార్థ్యానికి గాను గత ఏడాది సెప్టెంబరు 17 నాటికి 497 టీఎంసీలు ఉన్నాయి. ప్రస్తుతం కేవలం 241 టీఎంసీలే ఉన్నాయి. ప్రస్తుతం.. శ్రీశైలం లో 61 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో 44 టీఎంసీలు, సింగూరులో 3.5 టీఎంసీలు, తరువాయి 2 వ పేజీలో...



## అసెంబ్లీ నిరవధిక వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఎనిమిది రోజుల పాటు వాడీవేడిగా సాగిన తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 51 గంటల 52 నిమిషాల పాటు కొనసాగిన సభలో ప్రశ్నలు, చర్చలు, సభ్యుల ప్రసంగాలు, ప్రభుత్వ ప్రకటనలు, బిల్లుల ఆమోదంతో కీలక అంశాలు చర్చకు వచ్చాయి. మూడు ప్రభుత్వ తీర్మానాలకు సభ ఆమోదం తెలిపింది. అలాగే సభ ముందుకు వచ్చిన నాలుగు బిల్లులకూ ఆమోదం లభించింది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన తరువాయి 2 వ పేజీలో...

## చంటి పిల్లలకు 'నెస్లే' విషం!

### పలు ఆహార ఉత్పత్తులపై ఎఫ్ఎస్ఎస్ఏఐ అభ్యంతరం




న్యూఢిల్లీ: ప్రముఖ ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియాకు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) గట్టి షాక్ ఇచ్చింది. శిశువులకు సంబంధించిన ఆహార ఉత్పత్తుల విషయంలో నిబంధనలను ఉల్లంఘించినందుకుగానూ నెస్లే ఇండియాపై చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. నాన్ ఎక్సెలియా ప్రో స్టేజ్ 1, లాక్టోజెన్ ప్రో 1 వంటి శిశు ఆహార ఉత్పత్తులకు సంబంధించి నెస్లే ఇండియా ఆన్‌లైన్ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో ప్రచార సామగ్రిని ఉంచినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది. 'నాన్ ఎక్సెలియా ప్రోలో 5 హెచ్ఎంఓలు, వే ప్రోటీన్ ఉన్నాయి', 'లాక్టోజెన్ ప్రోలో సులభంగా జీర్ణమయ్యే వే ప్రోటీన్ ఉంది' తరువాయి 2 వ పేజీలో...

## 130 పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో మేనేజర్ (ఇంజినీరింగ్) పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మల్టీ జోన్-2 కేడర్‌లో మొత్తం 130 తరువాయి 2 వ పేజీలో...



## కొట్టి కొట్టి చంపారు

### చనిపోయాక కుటుంబ సభ్యులతో సెటిల్‌మెంట్ యత్నం

### హెబియస్ కార్పస్ వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి

### సాయికృష్ణ కేసులో సిట్ సంచలన విషయాలు వెల్లడి

విజయవాడ, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఏపీకి చెందిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిట్ కీలక ప్రకటన వెలువరించింది. పోలీసుల దెబ్బలకే సాయికృష్ణ చనిపోయాడని సిట్ స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ఏ-4 సురేష్ రిమాండ్ రిపోర్ట్‌లో సిట్ పేర్కొంది. పోలీసులు కొట్టి చంపారని కోర్టుకు సిట్ నివేదించింది. సీఐ నాగరాజు, కానిస్టేబుళ్లు కలిసి మృతదేహాన్ని దహనం చేశారని, ఆధారాలు మాయం చేశారని కోర్టుకు సిట్ తన రిపోర్ట్‌లో పేర్కొంది. సిట్ రిపోర్ట్ ప్రకారం.. మే 7వ తేదీన పీఎస్‌లో సాయికృష్ణను విచారించారు. రాణిగారితోటలోని పాడుబడ్డ భవనానికి తీసుకెళ్లి కొట్టారు. మే 12వ తేదీన సాయికృష్ణ మృతి చెందడంతో అర్ధరాత్రి బైక్‌పై మృతదేహాన్ని స్మశానానికి తరలించారు. స్వర్గపురి శ్మశాన తరువాయి 2 వ పేజీలో...

# బీఆర్ఎస్ వేట.. దానంపై వేటు

**మొదటి పేజీ తరువాయి**

నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన దానంపై అనర్హత వేటు వేయాలన్న పిటిషన్లను ట్రిబ్యునల్ ఆఫీసర్ హోదాలో స్పీకర్ కొట్టివేసిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ ఫిరాయింపును నిర్ధారించేందుకు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యే వ్యవహరించిన తీరును మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలంటూ స్పీకర్ వెలువరించిన తీర్పుపై పిటిషనర్లు హైకోర్టులో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మరో పార్టీ తరఫున పోటీచేయడం ద్వారా అసలు పార్టీ పట్ల తన రాజకీయ అనుబంధాన్ని వదులు కున్నట్టు స్పష్టమవుతున్నప్పుడు వేరే ఆధారాల కోసం చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. స్పీకర్ నిర్ణయం న్యాయపరమైన పరిశీలనకు లోబడి ఉంటుందని, స్పీకర్ అధికారాలు అపరిమితమైనవి కావని పిటిషనర్లు వాదించారు. కాగా, పిటిషనర్ల వాదనలను దానం నాగేందర్ తరపు న్యాయవాది తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని, కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వాన్ని తీసుకున్నట్టు ఎక్కడా ప్రకటించలేదని తెలిపారు. దానం ఇప్పటికీ అసెంబ్లీ రికార్డుల్లో బీఆర్ఎస్ సభ్యుడిగానే ఉన్నారని చెప్పారు. ఆయన కాంగ్రెస్ నేతలను కలవడం, వారితో ఫొటోలు దిగడం, కాంగ్రెస్ కండువా ధరించడం లేదా ఆయన కాంగ్రెస్‌లో చేరినట్టు మీడియాలో రావడం లాంటి అంశాలు పార్టీ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్టు నిర్ధారించేందుకు సరిపోవని పేర్కొన్నారు. దానం బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉంటూ కాంగ్రెస్ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసినంత మాత్రాన అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయినట్టు భావించరాదని వాదించారు. ఈ నేపథ్యంలో దానంపై వచ్చిన అనర్హత పిటిషన్ లను స్పీకర్ విచారించి కొట్టిపారేశారు. ఆయన ఇంకా బీఆర్ ఎస్ లోనే ఉన్నట్టు..కాంగ్రెస్ పార్టీలో లేరని ఈ ఏడాది మార్చి 11న తీర్పును వెలువరించారు.

**బీఫాం దెబ్బ కొట్టింది:** 2023 డిసెంబర్ లో జరిగిన శాసన సభ ఎన్నికల్లో బీఆర్ ఎస్ పార్టీ నుంచి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన దానం నాగేందర్.. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం 2024 ఏప్రిల్ నెలలో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీ ఫాం కూడా అందుకొని పోటీ చేశారు. అయితే..ఈ బీ ఫామ్ ఇప్పుడు ఈ కేసులో అత్యంత కీలక సాక్ష్యంగా మారింది. దీని ఆధారంగానే ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించింది. అంతేకాదు... బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా కొనసాగుతూ..కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా పోటీ చేసేందుకు నామినేషన్ వేసిన తేదీ 2024 ఏప్రిల్ 23 నుంచే దానం ఎమ్మెల్యే పదవిలో కొనసాగడానికి అనర్హుడంటూ హైకోర్టు స్పష్టం చేసింది. ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది వివేక్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు, స్పీకర్ కమ్ ట్రిబ్యునల్ గడ్డం ప్రసాద్ తరపున తులసీ రాజ్ గోకుల్, దానం నాగేందర్ తరపున సీనియర్ న్యాయవాది వెంకటేశ్, గౌరవ్ అగర్వాల్ వాదించారు.



# గొంతు తడిపాకే..!

**మొదటి పేజీ తరువాయి**



లోయర్ మానేరులో 8.95 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 44,034 చెరువుల్లో కేవలం 18 శాతం మాత్రమే నిండాయి" అని ఉత్తమ్ పేర్కొన్నారు. బీఆర్ ఎస్ వైఫల్యాలకు తోడుగా ఎల్ నినో కూడా రావడంతో రాష్ట్రం కరువు బారిన పడిందని మంత్రి ఉత్తమ్ విమర్శించారు. " కరువు తీవ్రతకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనా వైఫల్యాలతోపాటు ఎల్ నినో ప్రభావం కూడా కారణమైంది.ఎల్ నినో తీవ్రత దృష్ట్యా వర్షపాతం తగ్గే అవకాశం, సాగునీటి కొరతపై అన్నదాతలను అప్రమత్తం చేశాం. రైతులు నష్టపోకుండా పంటల ఎంపికపై ముందస్తు సూచనలు ఇచ్చాం.ఆయకట్టు వారీగా నీటి లభ్యతపై ఖచ్చితమైన సమాచారం అందిస్తున్నాం.ప్రతి మంగళవారం రైతు నేస్తం ద్వారా జలాశయాల పరిస్థితిని వివరిస్తున్నాం. నీరు సరిపోని చోట పంటలు వేయమని చెప్పడం బాధ్యతారాహిత్యమవుతుంది. ప్రజల తాగునీటికే ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుంది.తాగునీటి అవసరాలు తీర్చిన తరువాతే మిగులు జలాలను సాగుకు విడుదల చేస్తాంవచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నీటి నిల్వలను పరిరక్షిస్తున్నాం. జలాశయాల నిల్వలు, కొత్త ప్రవాహాలను పది రోజులకోసారి సమీక్షిస్తాం" అని మంత్రి ఉత్తమ్ చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయమైన వాటాను సాధించి తీరుతామని మంత్రి ఉత్తమ్ పునరుద్ఘాటించారు. తెలంగాణకు రావాల్సిన ఒక్క చుక్క నీటినీ వదులుకోమని చెప్పారు. " కృష్ణా జలాల కోసం ట్రిబ్యునల్, కేఆర్ఎంబీ, కేంద్రం వద్ద బలంగా వాదిస్తున్నాం.బీఆర్ ఎస్ నేతలు మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కృష్ణా జలాల్లో 66:34 తాత్కాలిక నిష్పత్తిని శాశ్వత హక్కుగా అంగీకరించలేదు.కృష్ణా జలాల్లో 50:50 పంపిణీ కోసం తెలంగాణ పట్టుబట్టాం. కాంగ్రెస్ వచ్చిన తర్వాతనే గోదావరిలో ఎన్నడూ లేని విధంగా 2025 -26 లో 340 టీఎంసీలు వాడుకున్నాం. అలాగే 2024-25లో అత్యధికంగా కృష్ణ బేసిన్ లో 286 టీఎంసీలు వినియోగించాం. ఇదొక రికార్డు. ఈ ఏడాది .. శ్రీశైలం నుంచి కూడా ఆంధ్రప్రదేశ్ కన్నా ఎక్కవ నీళ్లే తీసుకున్నాం. జూన్ 1 నుంచి..సెప్టెంబర్ 17 వరకు ఆంధ్రప్రదేశ్ 52 టీఎంసీలు తీసుకుంటే తెలంగాణ 84 టీఎంసీలను తీసుకున్నది. నాగార్జున సాగర్ నుంచి ఏపీ 17.2 టీఎంసీలు వాడుకుంటే తెలంగాణ 23.67 టీఎంసీలు వినియోగించుకున్నది. ఏ రకంగా చూసుకున్నా నీళ్ల విషయంలో బీఆర్ ఎస్ కంటే ఎక్కువగానే పోరాడుతున్నాం. ప్రజల ప్రాణభద్రతను పణంగా పెట్టి కాళేశ్వరం బ్యారేజీలను వినియోగించలేంచిన్న మరమ్మతుతోనే కాళేశ్వరాన్ని నడపవచ్చన్న బీఆర్ఎస్ వాదన సాంకేతికంగా తప్పు. ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూసీ మార్గదర్శకాల ప్రకారమే బ్యారేజీల పునరుద్ధరణ చేపడతాం. కాళేశ్వరం ప్రాజెక్టులో సురక్షితంగా ఉన్న లింక్-2 ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నాం. అలాగే పాలమూరు-రంగారెడ్డి పథకం 90 శాతం పూర్తయిందన్న బీఆర్ఎస్ ప్రచారం అవాస్తవం.కేవలం పంప్‌హౌస్‌లు నిర్మిస్తే ఎత్తిపోతల పథకం పూర్తయినట్లు కాదు.పాలమూరు-రంగారెడ్డిలో కాలువలు, పంపిణీ వ్యవస్థ, భూసేకరణ, పునరావాస పనులు అసంపూర్తిగా ఉన్నాయి" అని మంత్రి ఉత్తమ్ చెప్పారు.



# ఆర్టీసీలో ఎన్నికల హారన్

**మొదటి పేజీ తరువాయి**

ఎన్నికలను కార్మిక సంఘాలు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి. రాష్ట్ర, రీజనల్ స్థాయిలకు వేర్వేరు బ్యాలెట్ పత్రాలతో ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. రీజనల్ స్థాయిలో ఆఫీసర్ హోదాలో ఉన్నవారు మినహా, మిగిలిన కార్మికులు, ఉద్యోగులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తాజా షెడ్యూల్ విడుదలవడంతో ఆర్టీసీలో ఎన్నికల సందడి మొదలైంది.

## ఎన్నికల షెడ్యూల్ ఇది:

సెప్టెంబర్ 18: ఎన్నికల షెడ్యూల్ విడుదల
సెప్టెంబర్ 21: యూనియన్ల సమ్మతి
సెప్టెంబర్ 22: ఓటర్ల జాబితా అందజేత, అభ్యంతరాల స్వీకరణ
సెప్టెంబర్ 24: ఓటర్ల జాబితాపై అభ్యంతరాల దాఖలు
సెప్టెంబర్ 25: తుది ఓటర్ల జాబితా
సెప్టెంబర్ 26: యూనియన్లకు గుర్తుల కేటాయింపు, తుది జాబితా రిటర్నింగ్ అధికారికి అందజేత
సెప్టెంబర్ 29: డమ్మీ బ్యాలెట్ పేపర్లు
అక్టోబర్ 9: పోలింగ్.. ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు
అక్టోబర్ 14, 15: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్
అక్టోబర్ 17: ఫలితాల ప్రకటన

# మా ఆస్తులన్నీ తీసుకొని 1,000 కోట్లు ఇవ్వు..

**మొదటి పేజీ తరువాయి**

ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# 388 ఎకరాలపై ఫోకస్!

**మొదటి పేజీ తరువాయి**

విస్తరించి ఉన్న సర్వే నంబర్ 325లోని 388 ఎకరాల భూములపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. గురువారం ఈ మూడు గ్రామాల సరిహద్దులను గుర్తించిన బృందాలు, రెండో రోజైన శుక్రవారం ఆ భూములకు సంబంధించిన పాత రైతుల వివరాలను, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను సేకరించాయి. ఏడీ సుదర్శన్ రాథోడ్, డీఐ సేవియా నాయక్ పర్యవేక్షణలో నాలుగు ప్రత్యేక బృందాలు ఈ సర్వే ప్రక్రియను నిర్వహించాయి. క్షేత్రస్థాయిలో సేకరించిన సమాచారం, రెవెన్యూ రికార్డుల ఆధారంగా అధికారులు సమగ్ర నివేదికను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. అయితే, ఈ సర్వే చేపట్టడానికి గల కచ్చితమైన కారణాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

# అసెంబ్లీ నిరవధిక వాయిదా

**మొదటి పేజీ తరువాయి**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ హామీల అమలును నిరసిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నల్ల దుస్తులు, నినాదాలు ఉన్న నల్ల టీషర్టులతో అసెంబ్లీకి చేరుకున్నారు. వారిని పోలీసులు అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకుంది. సమావేశాల్లో నాలుగు స్వల్పకాలిక చర్చలు కూడా జరిగాయి. ఇక 119 మంది సభ్యులున్న తెలంగాణ అసెంబ్లీలో ప్రస్తుతం పార్టీల బలాబలాల విషయానికి వస్తే.. కాంగ్రెస్‌కు 66 మంది, బీఆర్ఎస్‌కు 37 మంది, బీజేపీకి 8 మంది, ఎంఐఎంకు 7 మంది, సీపీఐకి ఒక సభ్యుడు ఉన్నారు.

# కొట్టి కొట్టి చంపారు

**మొదటి పేజీ తరువాయి**

వాటికలో మృతదేహాన్ని కాల్చేశారు. సాయికృష్ణపై దాడికి సంబంధించిన ఫోటోలు డిలీట్ చేశారు. సాయికృష్ణ బంధువులను పోలీసులు హెబియస్ కార్పస్ పిటిషన్ విత్ డ్రా చేసుకోవాలని బెదిరించారు.

# 9 లక్షల ఇళ్లు ఇవ్వండి

**మొదటి పేజీ తరువాయి**



కొరత తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. వ్యవసాయ రంగంలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ అందించి ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. 250 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్స్, వెజిటెబుల్ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని గుర్తించి సహకరించాలని కోరారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# '22ఏ'పై హైలెవెల్ కమిటీ

**మొదటి పేజీ తరువాయి**

నియమించారు. ఈ కమిటీ 22ఏ భూముల సమస్యల్ని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో రెవెన్యూ, న్యాయ, రిజిస్ట్రేషన్ సంబంధిత అంశాలను పరిశీలిస్తుంది. ఈ హైలెవల్ కమిటీ 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన అభ్యంతరాలు, రికార్డులు, చట్టపరమైన అంశాలను ప్రధానంగా పరిశీలిస్తుంది. అనంతరం ఈ భూములకు పరిష్కార మార్గాలను సూచిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం 22ఏ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఆలస్యం కాకుండా చూడాలని భావిస్తోంది. ఆ దిశగానే హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ రెవెన్యూ రికార్డులు, న్యాయపరమైన అంశాలతో పాటుగా భూముల వర్గీకరణను పరిశీలించనుంది. అనంతరం అర్హత ఉన్న భూములకు సంబంధించిన సమస్యల్ని వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోనుంది.




# చంటి పిల్లలకు 'నెస్లే' విషం!

**మొదటి పేజీ తరువాయి**

వంటి క్లెయిమ్‌లతో ప్రచారం చేయడంపై ఎఫ్ఎస్ఎస్ఏఐ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ రెగ్యులేషన్స్ 2020తో పాటు 1992 నాటి చట్టం ప్రకారం, శిశు ఆహార ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించే ఇటువంటి ప్రకటనలు పూర్తిగా నిషిద్ధం. దీంతో పాటు, నెస్లే ఫార్ములా ఉత్పత్తుల్లో బయోటిన్ స్థాయిలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని కూడా ఎఫ్ఎస్ఎస్ఏఐ తన తనిఖీల్లో కనుగొంది. ఈ ఉల్లంఘనలపై కంపెనీ నుంచి వివరణ కోరగా, సంస్థ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ మూడు వేర్వేరు అడ్జుడికేషన్ కేసులు నమోదు చేసింది. ఈ వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో నెస్లే ఇండియా షేర్లు సుమారు 2 శాతం వరకు నష్టపోయి, రూ. 1,345 వద్ద ట్రేడ్ అయ్యాయి. శిశు పోషకాహార ఉత్పత్తులకు సంబంధించిన నియమ నిబంధనలను పాటించడంలో కంపెనీ విఫలమైందని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

# 130 పోస్టులకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

**మొదటి పేజీ తరువాయి**

పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23 నుంచి అక్టోబర్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ పోస్టులకు 18 నుంచి 44 ఏళ్ల మధ్య వయసున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయసును 2026 జూలై 1 నాటికి లెక్కిస్తారు. ఎంపికైన వారికి రూ.54,220 నుంచి రూ.1,33,630 పే స్కేల్‌లో వేతనం లభిస్తుంది. దరఖాస్తులు, అర్హతలు, ఎంపిక విధానం, ఇతర నిబంధనలకు సంబంధించిన పూర్తి వివరాలను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పింది.

# రాశి ఫలాలు

19.9.2026

మేషం: భాగస్వామ్య వ్యాపారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఉంటాయి. దూరప్రయాణాల వలన తగిన విశ్రాంతి ఉండదు. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు. ఆదాయనికి మించి ఖర్చులు పెరుగుతాయి. బంధువులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

వృషభం: నూతన వాహన సౌక్యం ఉన్నది. ఆర్థిక వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులతో సఖ్యతగా వ్యవహారిస్తారు. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి. చిన్ననాటి మిత్రులతో విందువినోదాల కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి.

మిధునం: చిన్నపాటి ఆరోగ్య సమస్యలు తప్పవు. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఎదురవుతాయి. అనుకున్న సమయానికి అనుకున్న పనులు పూర్తి చేయలేరు. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో మీ కష్టం ఫలించదు.

కర్కాటకం: ఆకస్మిక ధన లాభ సూచనలున్నవి. ముఖ్యమైన కార్యక్రమాలు కార్యరూపం దాలుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు లాభసాటిగా సాగుతాయి. బంధుమిత్రుల నుండి అందిన సమాచారం ఆశ్చర్యం కలిగిస్తుంది. సన్నిహితులతో వివాదాలు సర్దుబాటు కాగలవు.

సింహం: ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. నూతనోత్సాహంతో ముందుకు సాగుతారు. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలు అనుకూలంగా సాగుతాయి. విద్యా విషయాలు సంతృప్తికరంగా ఉంటాయి. సోదరులతో ముఖ్య విషయాలు చర్చిస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ధనసహాయం అందిస్తారు.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఇంటా బయట బాధ్యతలు భారంగా మారతాయి. నూతన ఋణ ప్రయత్నాలు అంతగా కలిసిరావు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక ప్రశాంతత లోపిస్తుంది. చేపట్టిన పనుల్లో అవాంతరాలు ఉంటాయి.

తుల: ఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించాలి. బంధువర్గం వారితో అకారణ వివాదాలు కలుగుతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి. కొన్ని పనులలో రెండు రకములైన ఆలోచనలతో నష్టాలు తప్పవు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో మీ అంచనాలు నిజమవుతాయి. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు ఆశాజనకంగా సాగుతాయి. వాహన కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులను కలుసుకుని ఉత్సాహంగా గడుపుతారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

ధనస్సు: నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ప్రారంభిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమౌతాయి. వ్యాపారాలు గతం కంటే మెరుగవుతాయి. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి స్నేహితుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి.

మకరం: వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. సోదరులతో ఆస్థి వివాదాలు చికాకు పరుస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. మానసిక సమస్యలు బాధిస్తాయి. ఉద్యోగాలలో సమస్యలు తప్పవు. ఇతరులకు మాట ఇవ్వటం మంచిది కాదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది.

కుంభం: ఒక విషయంలో బంధువర్గం నుండి విమర్శలు తప్పవు. ఇతరులపై మీ అభిప్రాయాన్ని మార్చుకోవడం మంచిది. కొన్ని వ్యవహారాలలో మీ అంచనాలు తప్పుతాయి. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగ్గ ఫలితం దక్కదు. ప్రయాణాలు వాయిదా పడతాయి.

మీనం: నూతన వ్యాపారాలు ప్రారంభించిన లాభాలు అందుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. సన్నిహితులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు పదోన్నతుల పెరుగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో మీ సేవలకు గుర్తింపు పొందుతారు. సోదరులతో వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి.

# జన్వాడ ఫాంహౌస్ కేటీఆర్‌ది కాదు

**చిన్నప్పటి ఫ్రెండ్ అయితే ఆయనది ఎలా అవుతుంది?**
**మీడియాతో యజమాని ప్రదీప్ రెడ్డి స్పష్టీకరణ**



హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయ చర్చకు దారితీస్తున్న వేళ.. ఆ ఆస్తి యజమానిగా చెప్పుకుంటున్న ప్రదీప్‌రెడ్డి రియాక్ట్ అయ్యారు. జన్వాడ ఫామ్‌హౌస్ ఉన్న భూమి తన సొంతమని స్పష్టమయ్యారు. ఆ భూమిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు యాజమాన్య హక్కు లేదని ఆయన తేల్చి చెప్పారు. కేటీఆర్ తనకు చిన్ననాటి నుంచి స్నేహితుడని.. తనకు చెందిన ప్రాపర్టీని ఆయనకు లీజుకు ఇచ్చినట్లు ప్రదీప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఫామ్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రదీప్‌రెడ్డి మాట్లాడారు. జన్వాడ ఫామ్‌హౌస్ తన వ్యక్తిగత ఆస్తి అని ప్రదీప్‌రెడ్డి మరోసారి స్పష్టం చేశారు. 2019లో ఈ ప్రాపర్టీని కొనుగోలు చేసి.. ఆ తర్వాత కేటీఆర్‌కు లీజుకు ఇచ్చానని ఆయన చెప్పారు. కేటీఆర్‌తో తనకు చిన్ననాటి నుంచే స్నేహం ఉందని పేర్కొన్నారు. ఫామ్‌హౌస్ భూములకు సంబంధించి ఎలాంటి వివాదం లేదని.. ఆస్తికి చట్టబద్ధమైన టైటిల్ ఉందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి గానీ సంబంధిత అధికారులకు ఆస్తిపై ఏవైనా సందేహాలు ఉంటే.. తనకు నోటీసులు జారీ చేసి వివరణ కోరవచ్చని ప్రదీప్‌రెడ్డి తేల్చి చెప్పారు. అవసరమైన పత్రాలు, వివరాలను చట్టపరమైన ప్రక్రియలో అధికారులకు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. జన్వాడ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్ నేతలు శనివారం పరిశీలించేందుకు, ముట్టడించేందుకు వస్తారన్న ప్రచారంపైనా ప్రదీప్‌రెడ్డి స్పందించారు. ప్రైవేట్ ఆస్తి వద్దకు రాజకీయ నాయకులు వచ్చి తనిఖీ చేయడం.. దాన్ని రాజకీయ వివాదంగా మార్చడం సరికాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆస్తికి సంబంధించి ప్రభుత్వానికి ఏవైనా అనుమానాలు ఉంటే చట్ట ప్రకారం విచారణ జరపవచ్చని తెలిపారు. అధికారులు అడిగే సమాచారం.. పత్రాలను సమర్పిం చేందుకు తాను పూర్తిగా సహకరిస్తానని స్పష్టం చేశారు. జన్వాడలోని భూములు, ఫామ్‌హౌస్‌కు సంబంధించి తెలంగాణ రాజకీయాల్లో ఇటీవల మళ్లీ చర్చ మొదలైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో జన్వాడ ఆస్తులపై పలు ఆరోపణలు చేయగా.. బీఆర్ఎస్ నేతలు వాటిని ఖండిస్తూ స్పందించారు. కాంగ్రెస్ నేతలు కూడా సంబంధిత భూములపై వివరాలు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

**- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్**

సందేహాలకు **94404 55811** నంబర్‌ను సంప్రదించవచ్చు.

## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**

కరీంనగర్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.


## సిద్దిపేట భూముల్లో కాషాయ జెండాలు పాతుతాం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**

కరీంనగర్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.


## 24న షర్మిల కూతురి ఎంగేజ్‌మెంట్

పులివెందుల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె ఏకైక కుమార్తె వైఎస్ అంజిలి రెడ్డి వివాహం ఖరారైంది. సోమల రఘురామ్ రెడ్డితో అంజిలి రెడ్డి ఏడడుగులు వేయనున్నారు. ఈ శుభవార్తను షర్మిల స్వయంగా ప్రజలతో పంచుకున్నారు. వివాహానికి సంబంధించిన నిశ్చితార్థం, ముహూర్తం, రిసెప్షన్ తేదీలను ఆమె అధికారికంగా వెల్లడించారు. ఈ సందర్భంగా షర్మిల తన కుటుంబ సభ్యులు, కాబోయే వియ్యంకులైన రఘురామ్ రెడ్డి తల్లిదండ్రులతో కలిసి ఇడుపులపాయలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్‌ను సందర్శించారు. అక్కడ తన కుమార్తె, కాబోయే అల్లుడి తొలి వివాహ ఆహ్వాన పత్రికను వైఎస్ఆర్ సమాధి వద్ద ఉంచి, ఆశీస్సులు తీసుకున్నారు. తండ్రి ఆశీస్సులతో ఈ శుభకార్యానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అనంతరం షర్మిల మాట్లాడుతూ.. "నాన్న స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి గారి ఆశీస్సులతో నా కుమార్తె అంజిలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డిల వివాహ మహోత్సవం జరగనుంది. ఈ శుభవార్తను దేవుడి



ఆశీర్వాదంతో నాన్న ఘాట్ వేదికగా మీతో పంచుకోవడం అత్యంత ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. ఈ నెల 24న నిశ్చితార్థం, నవంబర్ 25న వివాహం, డిసెంబర్ 5న రిసెప్షన్ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆమె వివరించారు.

## కేసీఆర్‌కు పరిమితికి మించి భూమి

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై బండి సంజయ్ తీవ్ర ధ్వజం**

కరీంనగర్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): సిద్దిపేట భూముల వ్యవహారంపై తెలంగాణ రాజకీయం మరింత వేడెక్కింది. ఈ వివాదంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భూకబ్జాలకు సంబంధించి నిజంగా ఆధారాలు ఉంటే వెంటనే ఆ భూములను స్వాధీనం చేసుకుని కేసీఆర్ కుటుంబంతో సహా బాధ్యులైన బీఆర్ఎస్ నేతలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సవాల్ విసిరారు.



ఆరు గ్యారంటీల అమలు నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ఈ డ్రామాలకు తెరలేపిందని, కేసీఆర్‌తో లాలూచీ పడేందుకే అసెంబ్లీలో ప్రత్యేక విచారణ కమిషన్ వేశారా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ గతమంతా అక్రమాలు, అవినీతి, భూదందాలతోనే నిండిపోయిందని బండి సంజయ్ ఆరోపించారు. ఎన్నికల అఫిడవిట్లను పరిశీలిస్తే కేసీఆర్ పుట్టుకతోనే వందల ఎకరాల యజమాని కాదనే విషయం స్పష్టమవుతుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకే బాటలో పయనిస్తూ పరస్పర ఆరోపణలతో కాలయాపన చేస్తున్నాయని, ఈ భూదోపిడీపై త్వరలోనే బీజేపీ ఆధ్వర్యంలో 'దండయాత్ర' చేపడతామని హెచ్చరించారు. ఆక్రమిత భూముల్లో కాషాయ జెండాలు పాతి పేదలకు పంచుతామని స్పష్టం చేసిన బండి సంజయ్, భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే రెండు పార్టీల అవినీతి, భూఆక్రమణలపై కఠిన విచారణ జరిపిస్తామని చెప్పారు.

## ఏసీబీ వలలో ఎమ్మార్వో



ములుగు, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ములుగు జిల్లాలో మరో అవినీతి చేప ఏసీబీ వలకు చిక్కింది. గోవిందరావుపేట మండల తహసీల్దార్ సృజన్‌కుమార్ తన కార్యాలయంలో శుక్రవారం లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. భూమిని వేరొకరి పేరు మీదకు మార్చేందుకు రూ.14 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఎకరం 10 గుంటల భూమిని తన కుటుంబసభ్యుల పేర్లపై మార్చేందుకు ఓ రైతు.. తహసీల్దార్ సృజన్‌కుమార్‌ను సంప్రదించాడు. అందుకు ఆయన రైతును లంచం డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడానికి నిరాకరించిన రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. శుక్రవారం గోవిందరావుపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో సృజన్‌కుమార్ సదరు రైతు నుంచి రూ.14 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం కార్యాలయంలో దాడులు నిర్వహించారు. సృజన్ కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే భయపడకుండా తమకు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచించారు.

## నా పార్టీ అసలైన రెడ్ల పార్టీ

రాయలసీమ పౌరుషం ఏమిటో చూపిస్తాం: విజయసాయిరెడ్డి



అనంతపురం, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త శకం ప్రారంభం కాబోతోందని, రాయలసీమ ప్రాంత అభివృద్ధి, స్థానిక ప్రజల ఆత్మగౌరవానికి ప్రతిరూపంగా త్వరలోనే నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీ రాబోతోందని మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వెల్లడించారు. అనంతపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, టీడీపీ, వైసీపీ రెండూ కుటుంబ రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చాయని... అసలైన రాయలసీమ పౌరుషాన్ని, ప్రాంతీయ సంక్షేమాన్ని కాపాడే బాధ్యతను తమ నూతన పార్టీ తీసుకుంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులవుతున్నా రెడ్డి కార్పొరేషన్‌ను ఎందుకు పునరుద్ధరించలేదని ఆయన నిలదీశారు. రాష్ట్ర విభజన అనంతరం సీమ ప్రాంతానికే చెందిన నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినప్పటికీ, రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు, జగన్ కుటుంబాలు కేవలం ఎన్నికల సమయంలోనే రాజకీయం చేస్తూ, సీమ నుంచి ప్రజల వలసలకు ప్రధాన కారణమయ్యారని ఆరోపించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే యువత భాగస్వామ్యంతో సీమను తిరిగి 'రతనాల సీమ'గా మారుస్తామని... అన్ని కులాలు, మతాల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని అన్నారు.

## 'ఫార్ములా' కేసులో కోర్టులో కేటీఆర్ హాజరు

హైదరాబాద్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

## 1.45 కోట్ల నోట్లతో గణపయ్య

పాల్వంచ, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో కొలువైన గణపతి విగ్రహం విశేష అలంకరణతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. బాపూజీ నగర్‌లోని గణనాథుడిని ఏకంగా రూ. 1.45 కోట్ల విలువైన కరెన్సీ నోట్లతో అత్యంత శోభాయమానంగా అలంకరించారు. వినాయక నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామివారికి ఈ ప్రత్యేక అలంకరణను నిర్వహించారు. వివిధ విలువలు గల కరెన్సీ నోట్లను ఉపయోగించి స్వామివారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో, గణనాథుడు 'ధనలక్ష్మీ గణపతి'గా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నానికి చెందిన మెహర్ బాబా డెకరేషన్ బృందం తమ నైపుణ్యంతో ఈ అద్భుత అలంకరణను చేపట్టింది. సుమారు కోటిన్నర రూపాయల విలువైన నోట్లతో ధగధగలాడుతున్న ఈ గణపతిని దర్శించుకునేందుకు పాల్వంచతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ అరుదైన అలంకరణతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికతతో కూడిన పండుగ వాతావరణం సంతరించుకుంది.



## శ్రీవారి పుష్కరిణిలోకి ఉదయం 3 గంటలకే అనుమతి

తిరుమల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 19న (శనివారం) గరుడసేవ నిర్వహించనున్నారు. ఈ గరుడ సేవను తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఈ క్రమంలో గరుడ సేవ రోజున భక్తుల్ని తిరుమల శ్రీవారి పుష్కరిణిలోకి ఉదయం 3 గంటల నుంచి అనుమతిస్తారని టీటీడీ తెలిపింది. సాధారణంగా తిరుమలలోని పుష్కరిణిలోకి భక్తుల్ని ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు స్నానమాచరించేందుకు అనుమతిస్తారు. కానీ గరుడసేవ రోజున భక్తుల భారీ తరలి వస్తారు.. రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి గరుడసేవ రోజున ఉదయం 3 గంటల నుంచే పుష్కరిణిని తెరిచి భక్తులను అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది.

## భోజనం పెట్టి పొలం చూపించేటోన్ని

**3,000 మంది పోలీసులను మోహరిస్తారా?**
**కాంగ్రెస్‌పై మాజీమంత్రి హరీశ్ రావు ధ్వజం**



సిద్దిపేట, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): సిద్దిపేటలోని తన భూములను పరిశీలిం చేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజన వసతి కల్పించి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలకు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

## 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు

**నేడు విశాఖలో అందించనున్న చంద్రబాబు**



వైజాగ్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఏపీలోని విశాఖపట్నంలో దశాబ్దాలుగా నెలకొన్న జటిల సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని, వాటిపై యాజమాన్య హక్కుల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల రేపు సాకారం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖపట్నం వేదికగా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 28,445 కుటుంబాలకు రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందజేయనున్నారు. విశాఖ నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అయితే, ఆ ఇంటి స్థలంపై వారికి పూర్తి హక్కులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తిని అమ్ముకోలేని, బదలాయించలేని పరిస్థితితో పాటు, భవిష్యత్తుపై భరోసా కరవైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. మొత్తం 399 ఎకరాల విస్తీర్ణంలోని 19,33,853 చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, ఆయా కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. విశాఖలో ఇంత భారీ స్థాయిలో భూముల క్రమబద్ధీకరణ చేపట్టి పట్టాలు పంపిణీ చేయడం ఇదే తొలిసారి.

## అభివృద్ధి పనులకు అడ్డుపడొద్దు: సంజయ్

జగిత్యాల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): అభివృద్ధి పనులకు ఎవరూ అడ్డుపడొద్దని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ధరూర్ క్యాంప్ రామాలయం నుంచి మెడికల్ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిర్మిస్తున్న నూతన రహదారి పనులతో పాటు కొత్త బస్టాండ్‌లో వాటర్ ట్యాంక్, పైప్‌లైన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలన్నారు. జగిత్యాల అభివృద్ధికి ఆటంకాలు కల్పించడం బాధాకరమన్నారు. వర్షాలతో దెబ్బతిన్న బీటీ రోడ్డును నాణ్యతతో పునరుద్ధరిస్తామని తెలిపారు. దుకాణ సముదాయాల అద్దెలను ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా సమీక్షించాలని కమిషనర్‌కు సూచించినట్లు చెప్పారు. అద్దె చెల్లించని వారికి నోటీసులిచ్చి సీజ్ చేస్తున్నామన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, కౌన్సిలర్లు, నాయకులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



## ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం

**మానవత్వం చాటుకున్న జైలర్, అవోప్ అధ్యక్షుడు**

జగిత్యాల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల లో ఆపదలో ఉన్న వ్యక్తికి రక్తదానం చేసి జైలర్ ఎస్.మొగులేష్, జగిత్యాల పట్టణ అవోప్ అధ్యక్షుడు కే.సంతోష్ మానవత్వం చాటుకున్నారు. బుగ్గారం మండలానికి చెందిన మల్లేశం ఆపరేషన్ నిమిత్తం అత్యవసరంగా రక్తం అవసరమైంది. దీంతో ఆయన బంధువులు వాట్సాప్ గ్రూపుల్లో రక్తం కోసం సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్.మొగులేష్, కే.సంతోష్ వెంటనే స్పందించి భారతి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో స్పందించి రక్తం అందించడంతో మల్లేశం కుటుంబ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం చేసి ప్రాణానికి అండగా నిలిచిన ఇద్దరినీ పలువురు అభినందించారు. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని వారు పేర్కొన్నారు.



## జగన్ కుటుంబానికి కేటీఆర్ రూ.10 లక్షలు

ఎండపల్లి, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఎండపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సింహాచలం జగన్ కుటుంబానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో జగన్ మృతి చెందిన నేపథ్యంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం కేటీఆర్‌ను కలిసి ఘటన వివరాలను తెలియజేశారు. జగన్ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరగా కేటీఆర్ వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్.. ఎలాంటి పరిస్థితుల్లోనూ కార్యకర్తలు ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించినట్లు నాయకులు తెలిపారు. జగన్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని కొప్పుల ఈశ్వర్ తెలిపారు. ఆర్థిక సాయం అందించడంపై కుటుంబ సభ్యులు, బీఆర్ఎస్ శ్రేణులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు ఏలేటి కృష్ణారెడ్డి, గాజుల మల్లేశం, మారం జలంధర్‌రెడ్డి, కల్వల గంగాధర్‌రావు, ముత్యం బలరాంరెడ్డి, రాంచందర్‌గౌడ్, మాధవరావు, సందీప్, కల్వల తేజ, దూస గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## దుర్గా నవరాత్రుల కరపత్రం విడుదల

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ గాయత్రి దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల కరపత్రాన్ని పద్మశాలి సేవా సంఘం మార్కండేయనగర్ అడహక్ కమిటీ సభ్యులు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆడువాల జ్యోతి లక్ష్మణ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బాలె చంద్రశేఖర్, వీరబత్తిని అనిల్‌కుమార్, సింగం గంగాధర్, కుసుమ వినయ్, సిరిపురపు రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా సర్ ప్రక్రియ: సత్యప్రసాద్

కోరుట్ల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోరుట్ల మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. నోటీసుల జారీ, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదుపై వివరాలు తెలుసుకున్నారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. ఆధారాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని, ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

# భీమన్న గుడిలో ఆది శ్రీనివాస్ పూజలు





వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తన జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఆది శ్రీనివాస్‌కు అర్చకులు, వేద పండితులు స్వస్తివచనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ రమాదేవి స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి, పూల మొక్కను బహూకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ ఉద్యోగ సంఘం ప్రతినిధులు కూడా ఆది శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, దేవస్థానం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**వెయ్యి మందికి అన్నదానం**

ఆది శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, పట్టణ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో సుమారు వెయ్యి మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు హాజరై భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఎర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ వినాయకుడి కృపాకటాక్షాలతో, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆది శ్రీనివాస్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆది శ్రీనివాస్‌కు త్వరలో మంత్రి పదవి కల్పించాలని కోరారు. ఆయనకు మంత్రి పదవి లభిస్తే వేములవాడ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించడం ఆనందంగా ఉందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూము మధు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పులి రాంబాబు గౌడ్, చిలక రమేష్, ఇప్పపూల అజయ్, ముంజ ఉమేందర్, మస్తాన్, మూడపల్లి నాగరాజు, మర్రిపల్లి రాజు, మైలారం రాము, అరుణ్ తేజ చారి, పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు బస్సా దశరథం, బస్సా శ్రీనివాస్, వేణు, పట్టణ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు ఎర్ర శ్రీనివాస్‌తో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## శిష్యుడి విజయమే గురువుకు గౌరవం: కేపీ వివేకానంద్

### 150 మంది ఉపాధ్యాయులకు గురు సన్మాన్ పురస్కారాలు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గుర్తింపు పొందిన అఫర్డబుల్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రాపసా) గ్రేటర్ కుత్బుల్లాపూర్ ఆధ్వర్యంలో గురు సన్మాన్ పురస్కార్-2026 కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గాజులరామారంలోని పద్మావతి కన్వెన్షన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న 150 మంది ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. కేపీ వివేకానంద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, క్రమశిక్షణతో కూడిన జీవితానికి వారిని సిద్ధం చేయడంలో ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. శిష్యుడి విజయమే గురువుకు అతిపెద్ద గౌరవమని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న వారిపై విద్యార్థులను మరింత బాధ్యతాయుతంగా, సన్మార్గంలో తీర్చిదిద్దే బాధ్యత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కే. రామేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, బిర్రు ఆంజనేయులు, ట్రాపసా గ్రేటర్ కుత్బుల్లాపూర్ చైర్మన్ కోలా వెంకటేష్ ముదిరాజ్, అధ్యక్షుడు వినోద్ జాదవ్, ప్రధాన కార్యదర్శి దయాకర్, కోశాధికారి శ్రీశైలం, ట్రస్మా జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, గడ్డమీది బాలరాజు, సీహెచ్ నరసింహులు, నరసింహులుగౌడ్, శ్యామ్, పద్మ, ఆంజనేయులు, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, పాఠశాలల డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్, అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి రావాలి: పుల్కం రాజు

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వేములవాడ పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణవ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి కోడె మొక్కు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు, స్థానిక నిరుపేదలకు, బాటసారులకు పండ్లను పంపిణీ చేశారు. పుల్కం రాజు మాట్లాడుతూ ఆది శ్రీనివాస్‌కు పురపాలక వర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ ప్రజల తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో మరింతగా కొనసాగేందుకు భగవంతుడు ఆయనకు శక్తి, సామర్థ్యాలను ప్రసాదించాలని కోరారు. ఆది శ్రీనివాస్‌కు త్వరలో రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరారు. ఆయనకు మంత్రి పదవి లభిస్తే వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని అన్నారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు తెలంగాణ చౌక్‌కు చేరుకుని భారీ కేక్‌ను కట్ చేశారు. ఒకరికొకరు కేక్ తినిపించుకుంటూ, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 350 మంది మహిళలతో కుంకుమ పూజ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని మార్కండేయనగర్ కాలనీలో వివేకానంద యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద కుంకుమ పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. వివేకానంద యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినాయక నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కుంకుమ పూజకు సహకరించిన దాత సన్నిధి వెంకటకృష్ణ, దివ్య దంపతులను అసోసియేషన్ సభ్యులు, మార్కండేయనగర్ కాలనీ ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, కాలనీ మహిళలు, యువతులు, పద్మశాలి సంఘం కులబాంధవులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



## ఆటో డ్రైవర్ నిజాయతీ

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఆటోలో ప్రయాణిస్తూ ఓ మహిళ మరిచిపోయిన బంగారం, నగదు ఉన్న పర్సును ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. పట్టణానికి చెందిన మహిళ ఆటోలో పర్సును మరిచిపోగా అందులో సుమారు అర తులం బంగారం, రూ.1,000 నగదు, ముఖ్యమైన కార్డులు ఉన్నాయి. పర్సును గుర్తించిన చల్గల్‌కు చెందిన ఆటో డ్రైవర్ పడాల సురేష్ జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఇన్‌స్పెక్టర్ పి.కరుణాకర్‌కు అప్పగించారు. పోలీసులు వివరాలు పరిశీలించి టౌన్ హెడ్‌కానిస్టేబుల్ డి.మోహన్ ద్వారా పర్సును బాధిత మహిళకు అందజేశారు. సురేష్ నిజాయితీని ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ అభినందించారు.

# పేద విద్యార్థికి వైద్యుల అండ

**ఎంబీబీఎస్ చదువుకు చేయూత.. కాలేజీ ఫీజు చెల్లించిన దారం సుశీల ట్రస్ట్, వైద్యుల బృందం**



పెగడపల్లి/జగిత్యాల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా పట్టుదలతో చదివి నీట్ పునఃపరీక్షలో ప్రతిభ కనబరిచిన జగిత్యాల జిల్లాకు చెందిన అనంత సాయికి వైద్యులు అండగా నిలిచారు. నీట్ పునఃపరీక్షలో జాతీయస్థాయిలో 46,165వ ర్యాంక్, తెలంగాణ రాష్ట్రస్థాయిలో 490వ ర్యాంక్ సాధించిన సాయి ఎంబీబీఎస్ సీటు పొందాడు. అయితే కళాశాల ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో దారం సుశీల ట్రస్ట్, పలువురు వైద్యులు ముందుకు వచ్చి అతని చదువుకు చేయూత అందించారు. పెగడపల్లి మండలం నామాపూర్‌కు చెందిన అనంత సాయి తల్లిదండ్రులు చిరు ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నప్పటికీ కుమారుడి చదువును కొనసాగించేందుకు వారు ప్రోత్సహించారు. తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే ఉద్దేశంతో సాయి చిన్ననాటి నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచాడు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించడంతో పాటు ఇంటర్మీడియట్‌లోనూ మంచి ప్రతిభ చూపాడు. వైద్యుడిగా ఎదగాలనే లక్ష్యంతో నీట్‌కు సిద్ధమై ర్యాంక్ సాధించాడు. నీట్‌లో మంచి ర్యాంక్ సాధించడంతో ఎంబీబీఎస్ సీటు లభించింది. అయితే కళాశాల ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కుమారుడి చదువును మధ్యలో ఆపకుండా కొనసాగించాలన్న తల్లిదండ్రుల ఆశకు ఆర్థిక సమస్య అడ్డంకిగా మారింది. ఈ విషయం సాయి తల్లి ద్వారా దారం సుశీల ట్రస్ట్ దృష్టికి వెళ్లింది. సాయి పరిస్థితిని తెలుసుకున్న కరీంనగర్‌కు చెందిన దారం సుశీల ట్రస్ట్ స్పందించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ రఘురామన్ సూచనతో పలువురు వైద్యులు సాయికి అండగా నిలిచారు. న్యూరో స్పెషలిస్ట్ డాక్టర్ తాటికొండ అనిల్‌కుమార్, రుమటాలజిస్ట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్, చర్మవ్యాధుల నిపుణురాలు డాక్టర్ శ్రీజ్యోతి, ఫార్మసీ విభాగానికి చెందిన పవన్, శ్రీనివాస్ కలిసి సాయి కళాశాల ఫీజును చెల్లించారు. దీంతో అతని వైద్య విద్యకు ఎదురైన ఆర్థిక ఇబ్బంది తొలగిపోయింది.



## ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు సమీపంలో ఉన్న శ్రీ సూర్య ధన్వంతరి ధనలక్ష్మి సహిత దేవాలయంలో భాద్రపద మాసం సప్తమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీ ధనలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించడంతో పాటు లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. అనంతరం మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, తాంబూలాన్ని ఆలయ అర్చకుల ఆశీర్వచనాలతో అందజేశారు. అనంతరం అమ్మవారికి ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్టు వ్యవస్థాపకులు, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వొడ్నాల లత, వడ్లగట్ట స్వాతి, అన్నపూర్ణ, హర్షిణి, రాధ, సునీత, లక్ష్మి, గంగమ్మ, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## అప్పారావుపేటలో ఘనంగా పోషణ్

కొడిమ్యాల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): పోషకాహారంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం అప్పారావుపేట గ్రామంలో పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పోషకాహారం ఎంతో కీలకమని, ప్రతి కుటుంబం పిల్లల ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో శారీరక, మానసిక వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్యాల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధారాణి అధికారి, అంగన్‌వాడీ టీచర్ పద్మ, గ్రామ ఉపసర్పంచ్ రేకులపల్లి తిరుపతిరెడ్డి, వార్డు సభ్యురాలు సిరిమల్ల రేణుక, ఏఎన్ఎం జమున, నాయకులు బండ నర్సింహారెడ్డి, అంగన్‌వాడీ చిన్నారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# చీకట్లో ప్రభుత్వ ఆస్పత్రి

## 24 గంటలు సేవలందించిన ఆస్పత్రికి విద్యుత్తు కష్టాలు.. పట్టించుకోని అధికారులు

జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 19 (ఈవార్తలు): గజ్వేల్ నియోజకవర్గంలోని జగదేవ్‌పూర్ మండలం తిగుల్ మేజర్ గ్రామపంచాయతీలోని ప్రభుత్వ ఆస్పత్రి చీకట్లో మగ్గుతోంది. గతంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించిన ఈ ఆస్పత్రి.. ప్రస్తుతం విద్యుత్తు సౌకర్యం లేక రాత్రివేళల్లో రోగులకు ఇబ్బందికరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిగుల్ ప్రభుత్వ ఆస్పత్రికి చుట్టుపక్కల ఉన్న ఐదు గ్రామాల ప్రజలు వైద్యం కోసం వస్తుంటారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో, పురిటి నొప్పులతో వచ్చే మహిళలకు ఈ ఆస్పత్రి ఎంతోకాలంగా సేవలందిస్తోంది. ఇలాంటి కీలకమైన ఆస్పత్రి ప్రస్తుతం చీకట్లో ఉండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆస్పత్రిలో విద్యుత్తు సమస్యను పరిష్కరించడంలో గ్రామపంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆస్పత్రిలో ఎంబీబీఎస్ వైద్యుడు, నర్సు అందుబాటులో లేకపోవడం వల్ల వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిలో కనీస సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని స్థానికులు పేర్కొన్నారు. అధికారులు వెంటనే స్పందించి ఆస్పత్రికి విద్యుత్తు సౌకర్యం కల్పించడంతో పాటు వైద్యుడు, నర్సు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఏఐని అదుపులో ఉంచే సాంకేతికత లేదు: సత్య నాదెళ్ల



సియాటెల్: వేగంగా విస్తరిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండాలని, దీని కోసం ప్రభుత్వాలు, టెక్నాలజీ కంపెనీల మధ్య అంతర్జాతీయ స్థాయిలో బలమైన నిబంధనలు అవసరమని మైక్రోసాఫ్ట్ ఛైర్మన్, సీఈఓ సత్య నాదెళ్ల అన్నారు. ఈ ప్రక్రియలో అమెరికా, చైనా దేశాల మధ్య అవగాహన అనేది అత్యంత కీలకమైన తొలి అడుగని ఆయన స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న సియాటెల్‌లో జరిగిన 'ఐడియాస్ ఫర్ ఇండియా' ఫోరమ్‌లో ఆయన ప్రసంగించారు. ఏఐ రంగంలో శక్తివంతమైన ఆవిష్కరణలు వస్తున్నప్పటికీ, దాని నియంత్రణకు సంబంధించిన కీలక ప్రశ్నలకు సమాధానాలు ఇంకా లభించలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ఏఐని పూర్తిగా అదుపులో ఉంచే సాంకేతిక విజ్ఞానం (సైన్స్ ఆఫ్ అలైన్‌మెంట్) మన వద్ద ఇంకా సిద్ధంగా లేదు. కానీ అత్యంత శక్తివంతమైన టెక్నాలజీ మాత్రం మన చేతిలో ఉంది. ఇది ఒక వాస్తవం" అని ఆయన వివరించారు. మానవాళికి సేవ చేయని, మనిషి నియంత్రణలో లేని ఏ టెక్నాలజీ అయినా నిష్ప్రయోజనమని సత్య నాదెళ్ల తేల్చిచెప్పారు. ఏఐ అభివృద్ధిలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొంటూనే, దాని వల్ల కలిగే ప్రయోజనాలను ప్రపంచానికి అందించాలని సూచించారు. అయితే, ఊహించని పరిణామాలను నివారించేందుకు నిరంతర ప్రయత్నాలు జరగాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల పాత్ర గురించి మాట్లాడుతూ, ఏఐ పాలనలో తొలి అడుగు అమెరికా-చైనా మధ్య ఏకాభిప్రాయంతో కూడిన నిబంధనల రూపకల్పనే అని పునరుద్ఘాటించారు. అయితే ఈ చర్చల్లో ప్రపంచంలోని ఇతర దేశాలను కూడా భాగస్వాములను చేయాలని ఆయన అన్నారు. ఏఐని అభివృద్ధి చేస్తున్న కంపెనీలు, దేశాలు కలిసికట్టుగా ఉమ్మడి నిబంధనలు రూపొందించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.



## వినాయక మండపంలో రక్తదాన శిబిరం

కూకట్‌పల్లి, సెప్టెంబర్ 18 (ఈవార్తలు):వినాయక చవితి సందర్భంగా కూకట్‌పల్లిలోని వినాయక మండపం వద్ద బజరంగ్ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం, రక్తదాన శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్, ప్రముఖ వ్యాపారవేత్త కె. కొండల్‌రావు సౌజన్యం అందించారు. ముందుగా వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో పలువురు యువకులు, భక్తులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ వినాయక భక్త బృందం సభ్యులు సుదర్శన్‌రావు, కార్తీక్‌రావు, సురేష్, భాస్కర్, పాలమూరు మాణిక్‌రెడ్డి, మోలుగు శ్రీను, ఎంఎస్‌పీ రావు, అప్రావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# స్పామ్ కాల్స్‌కు చెక్

న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్, వాణిజ్య సందేశాలకు అడ్డుకట్ట వేసేందుకు టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. ఆటోమేటెడ్ కాల్స్, వినియోగదారుల విచారణ ఆధారంగా చేసే ప్రచార కాల్స్‌పై ఆంక్షలను మరింత కఠినతరం చేసింది. ఒక వ్యక్తి ఏదైనా ఉత్పత్తి లేదా సేవ గురించి కంపెనీని సంప్రదిస్తే.. ఆ విచారణ ఆధారంగా వాణిజ్య సందేశాలు లేదా కాల్స్ ఏడు రోజుల వరకే చేసేందుకు అనుమతి ఉంటుంది. ఆ తర్వాత అదే విచారణను ఆధారంగా చేసుకుని ప్రచార కమ్యూనికేషన్ చేయడానికి వీలుండదు. ఇక ముందుగా రికార్డు చేసిన వాయిస్‌తో చేసే ఆటోమేటెడ్ లేదా రోబోకాల్స్‌కు 'ప్రీ-డిక్లరేషన్' తప్పనిసరి చేసింది ట్రాయ్. ఈ డిక్లరేషన్ లేకుండా ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చేసే కాల్స్‌ను స్పామ్‌గా పరిగణిస్తారు. అనుమతి లేని ఆటోమేటెడ్ కాల్స్‌ను నిరుత్సాహపరిచేందుకు ఒక్కో కాల్‌కు 5 పైసల టెర్మినేషన్ ఛార్జీ విధించాలని నిర్ణయించింది. దీంతో వాణిజ్య అవసరాల కోసం ఆటోమేటెడ్ కాలింగ్ సిస్టమ్స్‌ను దుర్వినియోగం చేయకుండా అడ్డుకట్ట వేయాలని ట్రాయ్ భావిస్తోంది. లావాదేవీలు, సేవలకు సంబంధించిన కాల్స్ కోసం 1601 సిరీస్ నంబర్లను ఇతర రంగాలకు విస్తరించే ప్రక్రియను ట్రాయ్ ప్రారంభించింది. తొలి దశలో విద్యుత్ పంపిణీ సంస్థలు, నీటి సరఫరా సంస్థలు, సిటీ గ్యాస్ సంస్థలు, ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్లు సహా యుటిలిటీ సేవల సంస్థలకు ఈ నంబర్లను కేటాయించనున్నారు. దీంతో సాధారణ 10 అంకెల మొబైల్ నంబర్ల నుంచి వచ్చే నకిలీ కాల్స్, మోసాలను గుర్తించడం వినియోగదారులకు సులభం కానుంది.

## ఈ ఏడాది జోరుగా పన్ను వసూళ్లు

### రూ.12.12 లక్షల కోట్లు దాటిన ఆదాయం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి పన్నుల ఆదాయం భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 17 వరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 13 శాతం పెరిగి రూ.12.12 లక్షల కోట్లకు చేరాయి. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) శుక్రవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ వివరాలు వెల్లడయ్యాయి. ఇదే సమయంలో స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు 15 శాతానికి పైగా పెరిగి రూ.14.3 లక్షల కోట్లకు చేరాయి. కార్పొరేట్ పన్ను వసూళ్లు 19.48 శాతం పెరిగి సుమారు రూ.5.56 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను, హిందూ అవిభక్త కుటుంబాల (హెచ్‌యూఎఫ్) నుంచి వచ్చిన వసూళ్లు 6 శాతం పెరిగి రూ.6.16 లక్షల కోట్లకు పైగా చేరాయి. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) వసూళ్లలోనూ భారీ పెరుగుదల కనిపించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 53 శాతం పెరిగి రూ.40,214 కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్ల జారీ కూడా 29 శాతానికి పైగా పెరిగి రూ.2.2 లక్షల కోట్లను దాటింది. మరోవైపు సెప్టెంబర్ 17 వరకు అడ్వాన్స్ ట్యాక్స్ వసూళ్లు 16.18 శాతం పెరిగి రూ.5.22 లక్షల కోట్లకు చేరాయి. ఇందులో కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 18 శాతం పెరిగి రూ.4.16 లక్షల కోట్లుగా, నాన్-కార్పొరేట్ అడ్వాన్స్ ట్యాక్స్ 9.24 శాతం పెరిగి రూ.1.06 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక ఏప్రిల్-జూలై మధ్య నాలుగు నెలల్లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు రూ.4.55 లక్షల కోట్లుగా ఉంది. పూర్తి ఆర్థిక సంవత్సర లక్ష్యంలో ఇది 26.8 శాతం. గత ఏడాది ఇదే కాలంలో ద్రవ్యలోటు రూ.4.7 లక్షల కోట్లు ఉండగా.. ఈసారి కొంత తగ్గింది. 2026-27లో ద్రవ్యలోటును జీడీపీలో 4.3 శాతానికి పరిమితం చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.

## బిడ్డ పుడితే గోల్డ్ రింగ్

### తమిళనాడు సీఎం విజయ్ కీలక నిర్ణయం



చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం మరో ప్రతిష్ఠాత్మక సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టింది. ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించే ప్రతి నవజాత శిశువుకు ఒక గ్రాము బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 6న జరగనున్న అసెంబ్లీ ఉపఎన్నికల నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. 'తైమామన్ తంగ మోతిరం' (మేనమామ బంగారు ఉంగరం)' పేరిట రూపొందించిన ఈ పథకాన్ని సెప్టెంబర్ 28న అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ ఏడాది జూన్ 22వ తేదీ నుంచి ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన్మించిన శిశువులందరికీ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన లబ్ధిదారులకు సెప్టెంబర్ 22 నుంచి ఉంగరాల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది.

## నౌకల ఢీ.. పాక్‌దే తప్పు:భారత్

న్యూఢిల్లీ: అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో భారత, పాకిస్థాన్ యుద్ధ నౌకలు ఢీకొన్నాయన్న వార్తలపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనకు సంబంధించి పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను భారత్ పూర్తిగా కొట్టిపారేసింది. అసలు తప్పంతా పాకిస్థాన్‌దేనని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఈ అంశంపై భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ ప్రత్యేక ఆర్థిక మండలిలో భారత నౌక రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిందన్న ఆరోపణలు అసంబద్ధమని, నిరాధారమని పేర్కొన్నారు. ఈ ఘటనపై పాకిస్థాన్ హైకమిషనర్‌ను భారత్ వివరణ కోరగా, వారు ఊహించినట్లుగానే ఎదురుదాడికి దిగి ఆ నిందను భారత్‌పై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పాకిస్థాన్ చేసిన ఆరోపణలను భారత్ పూర్తిగా తోసిపుచ్చుతోందని ఆయన తెలిపారు. ప్రమాదకర విన్యాసాలు చేస్తూ, సముద్రంలో ప్రమాదాల నివారణకు ఉద్దేశించిన అంతర్జాతీయ నిబంధనలను పాకిస్థాన్ ఉల్లంఘించిందని భారత్ ఆరోపించింది. అంతేకాకుండా, సముద్ర జలాల్లో ప్రమాదాల నివారణకు సంబంధించి 1991లో భారత్-పాకిస్థాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని కూడా పాక్ అతిక్రమించిందని వివరించింది. ఈ ఘటనలో చిక్కుకున్న భారత యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కతాకు ఎటువంటి తీవ్ర నష్టం జరగలేదని, ప్రస్తుతం అది సముద్రంలో తన కార్యకలాపాలను యథావిధిగా కొనసాగిస్తోందని అధికారులు వెల్లడించారు. పాకిస్థాన్ తన తప్పును కప్పిపుచ్చుకునేందుకే భారత్‌పై ఇలాంటి ఆరోపణలు చేస్తోందని భారత్ స్పష్టం చేసింది.

## ఆధ్యాత్మికతవైపు జెన్ జీ

### మోహన్ భగవత్

ఉజ్జయిని: ధర్మం అనేది కేవలం వృద్ధాప్యానికి పరిమితమైన అంశం కాదని, మనిషి పుట్టినప్పటి నుంచి చివరి వరకు అది మార్గనిర్దేశం చేస్తుందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన 'యువ ధర్మ సంసద్' కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రస్తుత కాలంలో యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున పాల్గొంటుండటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం శుభపరిణామమని కొనియాడారు. భగవద్గీత, రామాయణం వంటి పవిత్ర గ్రంథాలను కేవలం పదవీ విరమణ తర్వాత చదవాలని చాలామంది భావిస్తారని, అయితే ఆ అభిప్రాయం ఏమాత్రం సరైనది కాదని ఆయన స్పష్టం చేశారు. జీవితంలోని ప్రతి అడుగు ధర్మానుసారమే సాగాలని సూచించారు. నేటి తరం యువత (జెన్-జీ) ధర్మం, ఆధ్యాత్మిక అంశాలు, భజనల పట్ల ఆసక్తి కనబరచడం సంతోషకరమని భగవత్ అన్నారు. "అన్నీ నేనే చేస్తున్నాను" అనే అహంకారం కేవలం భ్రమకే దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. ధర్మాన్ని నిష్పక్షపాతంగా అర్థం చేసుకోవాలంటే, ముందుగా మనసులో ఉన్న పాత అపోహలను, ముందస్తు అభిప్రాయాలను పక్కన పెట్టాలని కోరారు.

## పకడ్బందీగా సర్ ప్రక్రియ: సత్యప్రసాద్

కోరుట్ల, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కోరుట్ల మున్సిపల్ పరిధిలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. నోటీసుల జారీ, విచారణ, ఓటర్ల నుంచి ఆధారాల సేకరణ, ఆన్‌లైన్ నమోదుపై వివరాలు తెలుసుకున్నారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులను వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. ఆధారాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని, ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై కళాబృందం అవగాహన

గంగాధర, సెప్టెంబరు 18 (ఈవార్తలు): ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ఆచంపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఆరే తేజశ్రీ రాజశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాబృందం సభ్యులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటల రూపంలో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, అర్హతలు, పథకాలను సద్వినియోగం చేసుకునే విధానంపై కళాబృందం సభ్యులు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాల వివరాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాటలు, కళారూపాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లకోటలో 'స్వచ్ఛత హి సేవ'

ఎండపల్లి, సెప్టెంబర్ 18 (ఈవార్తలు): స్వచ్ఛత, పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గొల్లకోట గ్రామంలో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గొల్లపెల్లి మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని విద్యార్థులకు, గ్రామస్థులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా అనేక అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గ్రామంలో పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించి 'స్వచ్ఛ భారత్-స్వచ్ఛ గొల్లకోట'గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని సర్పంచ్ తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి ప్రభుత్వ ఆరోగ్య బీమా చేయించినట్లు సర్పంచ్ వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కొమురయ్య, ప్రధానోపాధ్యాయుడు మునిందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## 30 ఏళ్లు దాటితే టెస్టోస్టెరాన్ టెస్ట్ తప్పనిసరి!

వాషింగ్టన్: అమెరికా సైన్యంలో కీలక మార్పు చోటుచేసుకుంది. 30 ఏళ్లు దాటిన సైనికులకు టెస్టోస్టెరాన్ లోపం ఉందా? లేదా? అన్నది పరీక్షించేలా పెంటగాన్ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే టెస్టోస్టెరాన్‌ను శారీరక సామర్థ్యం పెంచుకునేందుకు వాడటాన్ని మాత్రం అనుమతించబోమని స్పష్టం చేసింది. డిఫెన్స్ హెల్త్ ఏజెన్సీ సెప్టెంబరు 17న ఈ మార్గదర్శకాలను విడుదల చేసింది. యాక్టివ్ డ్యూటీతో పాటు రిజర్వ్ సైనికులకు వర్తించేలా సాధారణ పరీక్షలు, చికిత్స విధానాలను ఇందులో నిర్దేశించింది. 30 ఏళ్లలోపు సైనికులు మాత్రం తమకు పరీక్ష కావాలంటే కోరవచ్చు. సైనికుల యుద్ధ సన్నద్ధతను పెంచడమే ఈ చర్య వెనక అసలు లక్ష్యమని పెంటగాన్ తెలిపింది. "ఎప్పుడైనా యుద్ధానికి సిద్ధంగా ఉండే శక్తిమంతమైన సైనిక బలగాన్ని నిర్మించడంపై దృష్టి కొనసాగుతోంది" అని పెంటగాన్ ప్రధాన ప్రతినిధి తెలిపారు. అయితే టెస్టోస్టెరాన్ లోపానికి చికిత్స చేయడం, యుద్ధ సామర్థ్యాన్ని పెంచేందుకు హార్మోన్ వాడటం రెండూ వేర్వేరు అంశాలని మార్గదర్శకాలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధారాల ప్రకారం పనితీరు పెంపు కోసం టెస్టోస్టెరాన్ వాడటానికి తగిన శాస్త్రీయ మద్దతు లేదని పేర్కొంది. ముందుగా సైనికుల్లో లక్షణాలు, ప్రమాద కారకాలను పరిశీలిస్తారు. అనుమానం ఉంటే రక్త పరీక్ష చేస్తారు.



## ఢిల్లీ బ్రాండ్ అంబాసిడర్‌గా సంజూశాంసన్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా స్టార్ క్రికెటర్, యూత్ ఐకాన్ సంజూ శాంసన్‌ను మదన్ లాల్ ఖురానా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని మోతీ నగర్ జన్ కౌశల్ కేంద్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించినట్లు ప్రకటించారు. ఢిల్లీ టీమ్‌తో చేరినందుకు ఆమె అభినందనలు తెలిపారు. ఈ భేటీ అనంతరం ముఖ్యమంత్రి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "సంజూకు ఢిల్లీతో ప్రత్యేక అనుబంధం ఉంది. అతడు తన బాల్యంలో క్రికెట్ ప్రయాణాన్ని ఇక్కడే ప్రారంభించాడు. ఇప్పుడు బ్రాండ్ అంబాసిడర్‌గా ఢిల్లీ యువతలో నైపుణ్యాభివృద్ధి, మెరుగైన అవకాశాలు, స్వావలంబన పట్ల స్ఫూర్తిని నింపుతాడు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్ ఖురానాతో పాటు ట్రినిటీ ఫౌండేషన్, ఐఏసీటీ ఎడ్యుకేషన్ సభ్యులు పాల్గొన్నారు.

లవ్లీ చిత్రం



ఐషా శర్మ

## ప్రొడ్యూసర్‌గా దీపిక



బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకోణ్ ప్రొడ్యూసర్‌గా సినిమా చేయబోతుంది. అన్నా హాథ్‌వే, రాబర్డ్ డీ నీరో ప్రధాన పాత్రల్లో నటించిన హాలీవుడ్ మూవీ ది ఇంటెర్న్ కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. కేవలం 35 మిలియన్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ ఎమోషనల్ డ్రామా మూవీ రెండు వందల మిలియన్లకుపైగా వసూళ్లను దక్కించుకుంది. ఈ హాలీవుడ్ సినిమాను బాలీవుడ్‌లోకి రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ రీమేక్‌లో అమితాబ్‌బచ్చన్, ప్రధాన పాత్రలో నటించబోతున్నారు. అమిత్ శర్మ దర్శకత్వం వహించనున్నారు. ఒరిజినల్‌తో పోలిస్తే దర్శకుడు కథలో చేసిన మార్పులు, ఎమోషనల్‌గా క్యారెక్టర్లను తీర్చిదిద్దిన తీరు నచ్చడంతో ఈ సినిమాను నిర్మించడానికి దీపికా పదుకోణ్ అంగీకరించినట్లు సమాచారం. సినిమాల నిర్మాణం కోసం కా ప్రొడక్షన్స్ పేరుతో బ్యానర్‌ను నెలకొల్పింది. ఈ బ్యానర్‌పై ఛపాక్ అనే సినిమాను నిర్మించింది. భర్త రణవీర్‌సింగ్ హీరోగా నటించిన 83 మూవీకి కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరించింది. ఇంటెర్న్ రీమేక్ దీపికా పదుకోణ్ బ్యానర్‌లో వస్తోన్న మూడో మూవీ. త్వరలోనే ఈ సినిమా అఫీషియల్‌గా ప్రారంభం కానున్నట్లు సమాచారం.

## కత్రికా శరీరాకృతిపై ట్రోలింగ్



బాలీవుడ్ ప్రముఖ నటి కత్రినా కైఫ్ ప్రసవానంతరం బరువు పెరిగారంటూ సోషల్ మీడియా వేదికగా సాగుతున్న విమర్శలు, ట్రోలింగ్‌పై టాలీవుడ్, బాలీవుడ్ నటి సోనారికా భడోరియా తీవ్రస్థాయిలో స్పందించారు. మాతృత్వం పొందిన మహిళల శరీరంలో వచ్చే సహజ సిద్ధమైన మార్పులను ప్రశ్నించడం, వారి రూపాన్ని బట్టి విమర్శించడం అత్యంత విచారకరమని పేర్కొంటూ కత్రినాకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ సామాజిక మాధ్యమాల్లో సుదీర్ఘ పోస్ట్ చేశారు. బిడ్డకు జన్మనివ్వడం అనేది అత్యంత సంక్లిష్టమైన ప్రక్రియ అని, ఆ సమయంలో మహిళ శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుందని సోనారికా గుర్తుచేశారు. ఒక నటిగా సమాజంలో ఎంతటి గుర్తింపు ఉన్నప్పటికీ, ఆమె ప్రసవం తర్వాత ఎలా కనిపిస్తోంది లేదా ఎంత బరువు పెరిగింది అనే దానికంటే ఒక బిడ్డకు జన్మనివ్వడానికి ఆమె పడిన శ్రమను, గడిపిన నిద్రలేని రాత్రులను అర్థం చేసుకోవడం ముఖ్యమని చెప్పారు.



## ఇరుముడి భామ.. 'రుక్మిణి'గా!

ఇరుముడి సక్సెస్‌తో ప్రియా భవానీ శంకర్ లక్కీ ఛాన్స్ అందుకున్నట్లు సమాచారం. నితిన్ కథానాయకుడిగా హీరో నాని నిర్మాతగా అలియాస్ రుక్మిణి పేరుతో రొమాంటిక్ ఎంటర్‌టైనర్ మూవీ రాబోతుంది. ఇటీవలే ఈ సినిమా లాంఛ్ అయ్యింది. దండోరా ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. అలియాస్ రుక్మిణిలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్‌తో పాటు మరికొందరి పేర్లు వినిపించాయి. కానీ వారందరిని కాదని ఈ ఛాన్స్ ప్రియా భవానీ శంకర్‌ను వరించినట్లు తెలిసింది. సెప్టెంబర్ నెలాఖరు నుంచి ఈ కోలీవుడ్ సుందరి అలియాస్ రుక్మిణి షూటింగ్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలిసింది. అలియాస్ రుక్మిణిలో కృష్ణ అనే రైటర్ పాత్రలో నితిన్ కనిపించబోతున్నాడు. రుక్మిణి అనే మారుపేరుతో నవలలు రాస్తుంటాడు. అసలు రుక్మిణి ఎవరు? అనే అంశాలతో ఈ మూవీ రూపొందుతోంది. అలియాస్ రుక్మిణి రిలీజ్ డేట్ ఖరారు అయినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. డిసెంబర్ 3న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## సంక్రాంతికి త్రిష డబుల్ ధమాకా



సంక్రాంతికి త్రిష బాక్సాఫీస్ వద్ద తన సినిమాతో తానే పోటీపడబోతుంది. చెన్నై క్వీన్ హీరోయిన్‌గా నటించిన రెండు సినిమాలు పండుగ బరిలో నిలవబోతున్నాయి. ఇందులో ఒకటి తమిళ సినిమా కాగా...మరోటి తెలుగు మూవీ కావడం గమనార్హం. చిరంజీవి హీరోగా నటించిన విశ్వంభర వచ్చే సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయబోతుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయి రెండేళ్లు దాటిపోయింది. వీఎఫ్‌ఎక్స్, గ్రాఫిక్స్ పనులు ఆలస్యం కావడంతో వాయిదాపడుతూ వస్తోంది. ఇటీవలే నిర్మాణానంతర కార్యక్రమాలు మొత్తం పూర్తయినట్లు సమాచారం. ఓటీటీ డీల్ కూడా క్లోజ్ అయ్యింది. భారీ ధరకు అమెజాన్ ప్రైమ్ విశ్వంభర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకుంది. ఓటీటీ సంస్థతో కుదిరిన ఒప్పందం కారణంగా సంక్రాంతికి విశ్వంభరను థియేటర్లలోకి తీసుకురాబోతున్నారు మేకర్స్. మైథలాజికల్ సోషియా ఫాంటసీ కథతో రూపొందుతోన్న ఈ సినిమాలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. దాదాపు ఇరవై ఏళ్ల లాంగ్ గ్యాప్ తర్వాత చిరంజీవి, త్రిష కాంబినేషన్‌లో వస్తోన్న ఈ సినిమాకు వశిష్ట మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. గతంలో వీరిద్దరి కలయికలో స్టాలిన్ మూవీ రూపొందింది. విశ్వంభర సినిమాను యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. త్రిష హీరోయిన్‌గా ఇటీవలే ఓ తమిళ సైకలాజికల్ థ్రిల్లర్ లండన్‌లో ప్రారంభమైంది. బాలీవుడ్ డైరెక్టర్ రాజాకృష్ణ మీనన్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సంక్రాంతికి థియేటర్లలోకి రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. పండుగను టార్గెట్‌గా పెట్టుకొని మేకర్స్ షూటింగ్‌ను పూర్తిచేసే పనిలో ఉన్నట్లు సమాచారం. రాధికా శరత్‌కుమార్, అపర్ణ బాలమురళి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

## బాలీవుడ్ బతుకు గ్లామరే




బాలీవుడ్ స్టార్ బ్యూటీ రాధికా ఆప్టే, శకున్ బాత్రా ఓ ఇంటర్వ్యూలో భాగంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. బాలీవుడ్ చిత్రాలలో రొమాన్స్‌ను ప్రదర్శించే తీరుపై రాధికా ఆప్టే తన అభిప్రాయాలను పంచుకుంటూ.. తాను షారుఖ్ ఖాన్ సినిమాలకు వీరాభిమానినని చెబుతూనే.. చిన్నతనంలో తాను ఎంతో ఆస్వాదించిన ఆయన పాత చిత్రాలను ఇప్పుడు తిరిగి చూసినప్పుడు కొన్ని దృశ్యాలు తనను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేశాయని తెలిపారు. ఒకప్పుడు తెరపై ఎంతో శృంగారభరితంగా, గొప్ప ప్రేమగా చూపించిన అనేక సీన్లు నిజానికి ఎంత అభ్యంతరకరంగా ఉన్నాయో ఆమె వివరించారు. ముఖ్యంగా ఒక మహిళ వద్దు అని స్పష్టంగా చెప్పినప్పటికీ, ఆమె అభ్యంతరాన్ని పట్టించుకోకుండా బలవంతంగా వెంటపడటాన్ని ప్రేమగా చూపించడాన్ని ఆమె విమర్శించారు. టీనేజ్ వయసులో ఇలాంటి వాటినే గొప్ప కలలుగా కనేవాళ్లమని, కానీ ఇప్పుడు ఆలోచిస్తే అది ఎంత భయానకంగా అనిపిస్తుందోనని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదే విషయమై దర్శకుడు శకున్ బాత్రా స్పందిస్తూ.. పాతకాలపు హిందీ సినిమాలలో మానసిక కోరికలను తెరకెక్కించిన విధానం గురించి ప్రస్తావించారు. ఆ కథలన్నీ కేవలం పురుషుల కోణం నుంచే నడిచాయని చెప్పారు. శకున్ అభిప్రాయంతో పూర్తి ఏకీభవించిన రాధికా ఆప్టే.. అప్పట్లో తెరపై మహిళలను చిత్రించిన విధానంలోనే అసలైన లోపం ఉందని అన్నారు.

## మగవాళ్లకు పీరియడ్స్ వస్తే బాగుండు: శ్రుతి



"మగవాళ్లకు కూడా నెలసరి (పీరియడ్స్) వస్తే ఎంత బాగుండు! కనీసం అప్పుడైనా మా కాంట్రాక్టులలో అధికారికంగా 'పీరియడ్స్ సెలవులు' అని రాసేవారేమో" అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగా మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతి ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పిని ఎదుర్కొంటానని ఆమె వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరితోనూ చెప్పుకోలేకపోయానని గుర్తుచేసుకున్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించడం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించేదాన్నని తెలిపారు. "కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని.

## త్వరలోనే అప్‌డేట్: శ్రీనిధి



విక్టరీ వెంకటేష్ హీరోగా, త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఆదర్శకుటుంబం'. ఇందులో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. నారా రోహిత్, నివేథా పేతురాజ్, యువినా పార్థవి, రాజా ఛైవల్ తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైన్మెంట్ మూవీ అక్టోబర్ 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఇందులో భాగంగా అప్పుడే ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన చిత్ర బృందం ఇప్పటికే విడుదల చేసిన అప్డేట్స్‌తో సినిమాపై హై బజ్ క్రియేట్ అయింది. అదే జోష్‌తో రీసెంట్‌గా టీజర్ రిలీజ్ చెయ్యగా నెట్టింట సూపర్ రెస్పాన్స్ సొంతం చేసుకుంది. ఈ క్రమంలోనే తాజాగా శ్రీనిధి శెట్టి తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా డైరెక్టర్ త్రివిక్రమ్‌తో ఉన్న కొన్ని స్పెషల్ ఫొటోలను పంచుకుంటూ.. 'అందరిలోనూ ప్రత్యేకమైన త్రివిక్రమ్ సార్‌తో.. ఎంతో సౌమ్యులు, గొప్ప వ్యక్తిత్వం కలవారు.



## సెన్సార్ పేరుతో గొంతు నొక్కుతున్నారు!

భారతదేశంలో సినిమాల సర్టిఫికేషన్ కోసం కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ తాజాగా సవరించిన నిబంధనలను విడుదల చేసింది. 1991 నాటి పాత మార్గదర్శకాల స్థానంలో ఈ కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చింది. అయితే, ఈ తాజా నిబంధనలపై సినీ వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది సర్టిఫికేషన్ కాదని, పూర్తిగా సెన్సార్ చేయడమేనని నెటిజన్లు, సినీ ప్రియులు మండిపడుతున్నారు. ఇక కొత్త నిబంధనల ప్రకారం.. సినిమాలలో హింస, డ్రగ్స్, ధూమపానం వంటి వాటిని ప్రోత్సహించేలా చూపకూడదు. లైంగిక దాడి దృశ్యాలను గ్రాఫిక్ రూపంలో ప్రదర్శించరాదు. మహిళలను కించపరిచేలా లేదా తక్కువ చేసి చూపేలా కంటెంట్ ఉండకూడదు. చిన్నారులు హింసకు గురయ్యే లేక హింసను ఎదుర్కొనే సన్నివేశాలపై ఆంక్షలు విధించారు. అలాగే, కోర్టుల గౌరవానికి భంగం కలిగించేలా, విదేశీ సంబంధాలను దెబ్బతీసేలా లేదా దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నించేలా చిత్రాలు ఉండకూడదని స్పష్టం చేశారు.



## ఆస్కార్ బరిలో 'గోంధల్'

ప్రతిష్ఠాత్మక 99వ అకాడమీ అవార్డులకు (ఆస్కార్స్) భారత్ తరఫున అధికారిక ఎంట్రీగా మరాఠీ చిత్రం 'గోంధల్' ఎంపికైంది. ఉత్తమ అంతర్జాతీయ చిత్రం (బెస్ట్ ఇంటర్నేషనల్ ఫిల్మ్) కేటగిరీలో ఈ చిత్రం పోటీపడనుంది. ఈ విషయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా శుక్రవారం ముంబైలో అధికారికంగా ప్రకటించింది. సంతోష్ దవాఖర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, మహారాష్ట్ర సంప్రదాయ జానపద కళారూపమైన 'గోంధల్' నేపథ్యంలో తెరకెక్కింది. రాత్రంతా సంగీతం, నృత్యం, పౌరాణిక కథలతో సాగే ఈ ప్రదర్శన ఆధారంగా సినిమాను రూపొందించారు. ఇందులో కిశోర్ కదమ్, ఇషితా దేశ్‌ముఖ్, యోగేశ్ సోహోని వంటి నటులు ప్రధాన పాత్రలు పోషించారు. ఈ ఏడాది ఆస్కార్ ఎంట్రీ కోసం మొత్తం 33 చిత్రాలు పోటీపడగా, జ్యూరీ 'గోంధల్' చిత్రాన్ని ఎంపిక చేసింది. దిల్జిత్ దోసాంజ్ నటించిన 'మై వాపస్ ఆవూంగా', 'బోర్డర్ 2', రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ వంటి భారీ బడ్జెట్ చిత్రాలు కూడా ఈ రేసులో ఉన్నప్పటికీ, జ్యూరీ మరాఠీ చిత్రానికే మొగ్గు చూపింది. ఆస్కార్ బరిలో నిలిచిన నాలుగో మరాఠీ చిత్రంగా 'గోంధల్' నిలిచింది. గతంలో 'శ్వాస్', 'హరిశ్చంద్రాచి ఫ్యాక్టరీ', 'కోర్ట్' చిత్రాలు భారత్ తరఫున అధికారికంగా ఎంపికయ్యాయి. గత ఏడాది 98వ అకాడమీ అవార్డుల కోసం నీరజ్ ఘైవాన్ దర్శకత్వం వహించిన 'హోమ్‌బౌండ్' చిత్రం భారత్ నుంచి ఎంపికై 15 చిత్రాల ఆస్కార్ షార్ట్‌లిస్ట్‌కు చేరుకోవడం గమనార్హం.



# రొనాల్డో ఇంకా ఆడతాడు!

పోర్చుగీస్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డో తన అంతర్జాతీయ కెరీర్‌పై కొనసాగుతున్న ఊహాగానాలకు తెరదించాడు. త్వరలో జరగబోయే యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ మ్యాచ్‌ల కోసం పోర్చుగల్ కొత్త హెడ్ కోచ్ జార్జ్ జెస్సస్ ప్రకటించిన జట్టులో అతనికి చోటు లభించింది. దీంతో రొనాల్డో అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి తప్పుకోవడం లేదని స్పష్టమైంది. ఇటీవల జరిగిన 2026 ఫిఫా ప్రపంచకప్‌లో, ప్రీక్వార్టర్ ఫైనల్ లో స్పెయిన్ చేతిలో పోర్చుగల్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఆ టోర్నమెంట్ తర్వాత రొనాల్డో తన అంతర్జాతీయ భవిష్యత్తుపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అదే తన చివరి ప్రపంచకప్ అని సూచించినప్పటికీ, అంతర్జాతీయ ఫుట్‌బాల్ నుంచి రిటైర్మెంట్ మాత్రం ప్రకటించలేదు. ఈ నేపథ్యంలో, అతని కెరీర్‌పై తీవ్రమైన చర్చ నడిచింది. తాజాగా కోచ్ జెస్సస్ ప్రకటించిన జట్టులో రొనాల్డో పేరు ఉండటంతో ఈ ఉత్కంఠకు తెరపడింది.

# అగార్కర్‌పై వేటు?

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ భవిష్యత్తుపై నెలకొన్న ఉత్కంఠకు త్వరలో తెరపడనుంది. అగార్కర్ పదవీకాలంపై మరో 15 రోజుల్లోగా నిర్ణయం తీసుకుంటామని బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పష్టం చేశారు. శుక్రవారం జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అజిత్ అగార్కర్ 2023 జులైలో చీఫ్ సెలక్టర్‌గా బాధ్యతలు చేపట్టాడు. అతడి పదవీకాలంలో భారత జట్టు అద్భుత విజయాలు సాధించింది. టీమిండియా 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడంతో పాటు, 2024 టీ20 ప్రపంచకప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ, స్వదేశంలో ఈ ఏడాది జరిగిన టీ20 ప్రపంచకప్ టైటిళ్లను గెలుచుకుంది. అక్టోబర్ 4తో అగార్కర్ పదవీకాలం ముగియనుండగా, 2027 వన్డే ప్రపంచకప్‌కు జట్టు సన్నద్ధమవుతున్న తరుణంలో బీసీసీఐ ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై సైకియా మాట్లాడుతూ.. "సమావేశంలో ఏ ఒక్క వ్యక్తి గురించీ చర్చ జరగలేదు. ఇంకా 15 రోజుల సమయం ఉంది. తగిన సమయంలో నిర్ణయం తీసుకుని, మీకు తెలియజేస్తాం" అని వివరించారు.







## ద్రవిడ్, సెహ్వాగ్ కొడుకుల జోరు

**ఆసీస్‌పై భారత్ సంచలన విజయం**

ఆస్ట్రేలియా అండర్-19తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల అనాధికారిక వన్డే సిరీస్‌లో భారత అండర్-19 జట్టు బోణీ కొట్టింది. శుక్రవారం రాజ్‌కోట్ వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో 7 పరుగుల తేడాతో భారత్ సంచలన విజయం సాధించింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 20 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత యువ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత ఇన్నింగ్స్‌లో యశ్వర్ధన్ చౌహాన్ (34 బంతుల్లో 54) టాప్ స్కోరర్‌గా నిలవగా, అన్వయ్ ద్రవిడ్ (18 బంతుల్లో 38), అరంగేట్ర ప్లేయర్ ఆర్యవీర్ సెహ్వాగ్ (26 బంతుల్లో 28) ధనాధన్ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నారు. ఆసీస్ బౌలర్లలో స్పెన్సర్ గ్రీన్, ఎలీ బ్రెయిన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం 183 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 175 పరుగులు చేసి ఓటమిపాలైంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో కెప్టెన్ జాక్ జోస్నెక్ (55) నీల్ పటేల్ (45), హేడెన్ బార్బులోవిక్ (40) రాణించినప్పటికీ మిడిలార్డర్ వైఫల్యంతో ఓటమి తప్పలేదు. చివరి ఓవర్లో ఆస్ట్రేలియా విజయానికి 11 పరుగులు అవసరం కాగా.. భారత పేసర్ మోహిత్ ఉల్వా కేవలం 3 పరుగులు మాత్రమే ఇచ్చి భారత్‌కు థ్రిల్లింగ్ విజయాన్ని అందించాడు. భారత బౌలర్లలో యశ్వర్ధన్ చౌహాన్ రెండు వికెట్లు తీశాడు.



# చాంపియన్ల జోరు

ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత జట్లు అదరగొడుతున్నాయి. ఓపెన్, మహిళల విభాగంలో ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచిన భారత్.. శుక్రవారం జరిగిన మూడో రౌండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ఓపెన్ విభాగంలో 3-1తో ఇటలీని ఓడించిన భారత్.. విమెన్ సెక్షన్‌లో 3.5-0.5తో గ్రీస్‌ను చిత్తుచేసింది. ఓపెన్ కేటగిరీలో నిహాల్ సరిన్, గుకేశ్ తమ ప్రత్యర్థులను ఓడించగా ప్రజ్ఞానంద, అర్జున్ డ్రాలతో సరిపెట్టుకున్నారు. అమ్మాయిల విషయానికొస్తే కోనేరు హంపి, వంతిక అగర్వాల్, సవిత శ్రీ గెలుపు జోరును కొనసాగించగా దివ్య దేశ్‌ముఖ్ గేమ్ డ్రాగా ముగిసింది.

# వీధుల్లో భారత షూటర్లు

**జపాన్‌లో అథ్లెట్లకు కష్టాలే కష్టాలు**

ఆసియా క్రీడల్లో అథ్లెట్లకు మెరుగైన వసతులు లేకపోవడం తీవ్ర సమస్యగా మారుతోంది. సర్దుకుపోదాంలే అనుకుంటూ నగోయలో అడుపెట్టిన క్రీడాకారులకు అడుగడుగునా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆసియాడ్‌లో పతకాల వేటకు వెళ్లిన భారత షూటర్లకు కష్టాలు స్వాగతం పలికాయి. జపాన్‌లో కాలుమోపిన రోజే రవాణా సౌకర్యం ఆలస్యం కారణంగా వీధుల్లో నిరీక్షించారు మన షూటర్లు. అంతేకాదు వసతుల కొరత, శిక్షణకు అంతరాయం వంటివి భారత బృందానికి సవాల్ విసురుతున్నాయని ఎన్డీటీవీ కథనం పేర్కొంది. పద్దెనిమిదో ఆసియా క్రీడల కోసం భారత షూటర్ల బృందం సెప్టెంబర్ 15న జపాన్ వెళ్లింది. రాత్రి 11 గంటలకు కస్టమ్స్ అనుమతి లభించగా.. అక్రెడిటేషన్ నిర్ధరణ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడపదిహేను నిమిషలు పట్టగా.. ఇక బస్సు రావడం ఆసియా క్రీడల నగరం నగోయకు వెళ్లడమే తరువాయి అనుకున్నారంతా. కానీ, ఆశ్చర్యంగా.. రవాణా సౌకర్యం లేకపోవడంతో ఒలింపిక్ విజేత మనూ భాకర్, కామన్వెల్త్‌లో మెరిసిన ఇషా సింగ్‌లతో కూడిన 35 మంది భారత షూటర్ల బృందం వీధుల్లోనే నిరీక్షించింది. రాత్రి 11:45 గంటల నుంచి మరునాడు ఉదయం 3 గంటల వరకూ అక్కడే వేచి చూసిన షూటర్లు.. ఎట్టకేలకు మూడు తర్వాత తమకు కేటాయించిన హోటల్ చేరారు. 'హమ్మయ్య ఎలాగోలా వచ్చేశాం' అనుకొనే లోపే అక్కడ అంత మందికి ఏడు గదులే ఇవ్వడం చూసి షాకయ్యారు. ఈ విషయం తెలిసిన భారత ఒలింపిక్ సంఘం వెంటనే స్పందించింది. షూటర్ల సౌకర్యార్థం అక్కడికి 400 మీటర్ల దూరంలో 18 గదులు బుక్ చేసింది ఐఓఏ. ఈ సమస్య పరిష్కారం అయిందని సంతోషించిన భారత షూటర్లకు శిక్షణ కేంద్రానికి వెళ్లడంలో ఆటంకం ఏర్పడింది. ఉదయం 7 గంటలకు బస్సు ఎక్కి.. 8:20 గంటలకు ట్రైనింగ్ సెంటర్‌కు వెళ్లాలి. కానీ, ఒకటే బస్సు ఏర్పాటు చేయడంతో అందరూ ఒకేసారి వెళ్లలేకపోయారు. తదుపరి బస్సు వచ్చేంత వరకూ కోచ్‌లు, కొందరు షూటర్లు గంటల కొద్దీ క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ఇలా..



నగోయలో వసతి సౌలభ్యం నుంచి.. సాధన చేసేందుకు కూడా నిరీక్షించాల్సిన పరిస్థితి తలెత్తడంతో ఇదెక్కడి ఆతిథ్యం అని తల పట్టుకుంటున్నారు క్రీడాకారులు.

నగోయ నగరానికి తుఫాన్ ముప్పు

జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో అథ్లెట్లకు వసతులు సవాల్ విరుసుతున్నాయి. ఇది చాలదన్నట్టు వాతావరణం కూడా క్రీడాకారులను పరీక్షించనుంది. ఐచీ నగొయ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీకి తుఫాన్ ముప్పు పొంచి ఉంది. తీర ప్రాంతమైన ఈ నగరంలో రాబోయే రోజుల్లో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశముందని సమాచారం.




# దేశవాళీ అంపైర్లకు వేతన పెంపు

**మరోసారి ఐపీఎల్ చైర్మన్‌గా అరుణ్ సింగ్.. వార్షిక బడ్జెట్‌కు ఆమోదం.. బీసీసీఐ ఏజీఎంలో కీలక నిర్ణయాలు**

భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) దేశవాళీ అంపైర్లు, మ్యాచ్ రిఫరీలకు సంబంధించి ఒక కీలకమైన, సానుకూల నిర్ణయం తీసుకుంది. వారి వేతనాల పెంపుతో పాటు, గ్రేడ్లను పునర్వర్గీకరించే ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శుక్రవారం ముంబైలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన 95వ వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం)లో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దేశవాళీ క్రికెట్ వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ఈ చర్య ఎంతో ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

ఈ సమావేశంలో ఐపీఎల్ పాలక మండలికి (జీసీ) ఇద్దరు సభ్యుల ఎన్నిక ప్రక్రియ కూడా పూర్తయింది. ఐపీఎల్ చైర్మన్‌గా మరోసారి కొనసాగేందుకు పోటీ పడిన అరుణ్ సింగ్ ధూమల్, ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ (ఐసీఏ) ప్రతినిధిగా ఎం. ఖైరుల్ జమాల్ మజుందార్ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ రెండు స్థానాలకు మరెవరూ నామినేషన్లు దాఖలు చేయకపోవడంతో, బీసీసీఐ ఎన్నికల అధికారి ఏ.కే. జోటి వారి ఎన్నికను అధికారికంగా ధ్రువీకరించారు. దీనితో ఐపీఎల్ పరిపాలనలో స్థిరత్వం కొనసాగనుంది. సమావేశంలో పలు ఆర్థిక, పరిపాలనాపరమైన తీర్మానాలకు కూడా ఆమోదం లభించింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిటెడ్ ఖాతాలను, 2026-27 వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీ ఆమోదించింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను కూడా నియమించింది. భవిష్యత్ ప్రణాళికలపై కూడా బోర్డు దృష్టి సారించింది. 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను ఘనంగా నిర్వహించాలని, అలాగే 2028లో బీసీసీఐ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరపాలని తీర్మానించింది. శతాబ్ది వేడుకలు 2027 డిసెంబర్‌లో ప్రారంభమై 2028 అంతటా కొనసాగుతాయని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, సౌరభ్ తివారీ, జయదేవ్ షా, రోహన్ జైట్లీ, అభిషేక్ దాల్మియా వంటి కీలక వ్యక్తులు పాల్గొన్నారు. బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్) అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ ప్రసాద్ కూడా హాజరయ్యారు.

## బీసీసీఐ ఏజీఎం తీసుకున్న కీలక నిర్ణయాలు ఇవే..

1. బీసీసీఐ జనరల్ బాడీలో భాగమైన అరుణ్ సింగ్ ధుమాల్ మరోసారి ఐపీఎల్ చైర్మన్‌గా ఖరారు కాగా.. ఖైరుల్ జమాల్ మజుందార్ సభ్యుడిగా చేరారు.
2. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌కు బీసీసీఐ జనరల్ బాడీ ఆమోదం తెలిపింది.
3. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బీసీసీఐ ఆడిట్ చేయబడిన ఖాతాల నివేదికను జనరల్ బాడీ ఆమోదించింది.
4. 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆడిటర్లను నియమించారు.
5. అదేవిధంగా 2027లో జరగనున్న ఐపీఎల్ 20వ ఎడిషన్‌ను అత్యంత ఘనంగా నిర్వహించాలని జనరల్ బాడీ ఏకగ్రీవంగా నిర్ణయించింది.
6. బీసీసీఐ శత వసంత ఉత్సవాలు 2028లో ఘనంగా నిర్వహించాలని జనరల్ బాడీ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రక్రియను మొదలుపెట్టింది. డిసెంబరు 2027 నుంచి 2028 వరకు దాదాపు ఏడాది పాటు వేడుకలు చేయాలని నిర్ణయించింది. భారత క్రికెట్ చరిత్రలోని కీలక ఘట్టాన్ని వీలైనంత ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది.
7. దేశవాళీ క్రికెట్‌లో పని చేస్తున్న అంపైర్లు, రిఫరీల వేతనాలను పెంచాలని బీసీసీఐ నిర్ణయించింది. 2026--27 సీజన్ నుంచి ఇది అమల్లోకి వస్తుంది. దేశవాళీ అంపైర్లను ఎ, బి, సీ, డీ అనే నాలుగు గ్రేడ్‌లుగా విభజించేందుకు చర్యలు చేపట్టింది.
8. లైంగిక వేధింపుల నిరోధక విధానంలో భాగంగా బీసీసీఐ అంతర్గత కమిటీని ఏర్పాటు చేసింది.
9. ఆటగాళ్ల వయసు నిర్ధారణకు సంబంధించిన విధానంలో అప్‌డేట్ తీసుకువచ్చింది.
10. దివ్యాంగ క్రికెటర్లకు మద్దతుగా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు, వారికి కల్పించాల్సిన వనరులు, సౌకర్యాల గురించి రాష్ట్ర అసోసియేషన్లతో చర్చించింది. దివ్యాంగ క్రికెటర్ల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించే దిశగా అడుగులు వేయాలని నిర్ణయించింది.



# చరణి స్పిన్‌కు జపాన్ విలవిల

ఆసియా క్రీడల్లోనూ భారత మహిళల జట్టు అదరగొట్టింది. క్వార్టర్ ఫైనల్లో తిప్పేసిన శ్రీ చరణి(4-10) కెరీర్లోనే అత్యుత్తమ గణాంకాలు నమోదు చేయడంతో అలవోకగా జపాన్‌ను చిత్తు చేసింది టీమిండియా. స్వల్ప ఛేదనలో ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్, 2-13) విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను బెంబేలెత్తించింది. ఎనిమిది వికెట్ల తేడాతో భారీ విజయం సాధించిన ఉమెన్ ఇన్ బ్లూ సెమీస్‌కు దూసుకెళ్లింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా ఆసియా కప్‌లో అడుగుపెట్టిన భారత జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగ సాగుతోంది. నిరుడు గోల్డ్ మెడల్‌తో సత్తా చాటిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. దర్జాగా సెమీస్‌లో దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో జపాన్ బ్యాటర్లను శ్రీ చరణి(4-10) వణికించింది. ఈ తెలుగమ్మాయి సంచలన ప్రదర్శనతో 57 పరుగులకే ఆతిథ్య దేశం జట్టు కుప్పకూలింది. అనంతరం ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో 5 ఓవర్లలోనే ఉమెన్ ఇన్ బ్లూ జయకేతనం ఎగురవేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన జపాన్‌ను భారత స్పిన్నర్లు స్వల్ప స్కోర్‌కే కట్టడి చేశారు. ఓపెనర్ అయకా కటో స్టఫోర్డ్(25) ప్రతిఘటించినా.. శ్రీ చరణి(4-10), షఫాలీ వర్మ(2-13)ల ధాటికి మిగతా వారు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఒకే ఓవర్లో రెండేసి వికెట్లతో చరణి జపాన్‌ను కోలుకోలేని దెబ్బకొట్టింది. ఈ స్పిన్ ద్వయం వికెట్ల వేటతో ప్రత్యర్థిని 57కే పరిమితం చేసింది టీమిండియా. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఐదు ఓవర్లలోనే టీమిండియా ఉఫ్‌మనిపించింది. ఓపెనర్ షఫాలీ వర్మ(40 నాటౌట్) మెరుపు అరంభాన్నిస్తూ.. 15 బంతుల్లోనే ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో విరుచుకుపడింది. జి.కమలిని(0), భారతి ఫుల్‌మాలి(6)లు విఫలమైనా షఫాలి దూకుడుతో జపాన్ బౌలర్లు అల్లాడిపోయారు. రీచా ఘోష్(12 నాటౌట్) జతగా టీమిండియాకు 8 వికెట్ల విజయం కట్టబెట్టింది డాషింగ్ ఓపెనర్. అద్భుత విజయంతో సెమీస్ చేరిన భారత్.. ఫైనల్ బెర్తు కోసం సెప్టెంబర్ 20వ తేదీన బంగ్లాదేశ్‌ను ఢీ కొట్టనుంది.

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# దానం ఓటమి.. ఓటరు గెలుపు!

ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమం. ఒక పార్టీ అభ్యర్థిగా ఎన్నికై, ఆ పార్టీ గుర్తుపై ప్రజల నుంచి ఓట్లు పొంది, గెలిచిన తర్వాత మరో పార్టీలోకి మారడం సాధారణ రాజకీయ పరిణామంగా కనిపించవచ్చు. కానీ దాని వెనుక ప్రజా తీర్పు పవిత్రత, ఓటరు విశ్వాసం, రాజ్యాంగ విలువలు అనే పెద్ద ప్రశ్నలు దాగి ఉంటాయి. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయంగా, రాజ్యాంగపరంగా ప్రాధాన్యం కలిగిన పరిణామం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. అంతేకాదు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. దీనిపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. స్పీకర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు, స్పీకర్ ఉత్తర్వులను పక్కనపెట్టి దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసి, ఖైరతాబాద్ స్థానాన్ని ఖాళీగా ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని స్పీకర్, ఎన్నికల సంఘానికి తెలియజేయాలని కూడా ఆదేశించింది. ఈ తీర్పును కేవలం ఒక ఎమ్మెల్యేపై తీసుకున్న చర్యగా మాత్రమే చూడకూడదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో చట్టం ఉందంటే దానికి అమలు కూడా ఉంటుందనే విషయాన్ని ఈ పరిణామం మరోసారి గుర్తుచేస్తోంది. పదో షెడ్యూల్ ఉద్దేశమే ఎన్నికైన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం పార్టీ మారే పరిస్థితులను నియంత్రించడం. ఆ చట్టం ఉన్నప్పటికీ సంవత్సరాల తరబడి ఫిరాయింపులు కొనసాగుతుండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్ర సవాలుగా మారింది. ఎన్నికల సమయంలో ఒక పార్టీకి ఓటు వేసిన ప్రజలు, ఆ పార్టీ అభ్యర్థి గెలిచిన తర్వాత అదే వ్యక్తి మరో పార్టీ కండువా కప్పుకోవాలని తీర్పు ఇవ్వలేదు. ప్రజాప్రతినిధి వ్యక్తిగత నిర్ణయానికి, ఓటరు ఇచ్చిన రాజకీయ తీర్పుకు మధ్య స్పష్టమైన తేడా ఉంది. అందుకే ఫిరాయింపు అనేది కేవలం ఒక రాజకీయ పార్టీకి జరిగిన నష్టం కాదు; అది ఓటరు తీర్పు విలువను కూడా ప్రశ్నించే అంశం. మరో ముఖ్యమైన విషయం.. ఫిరాయింపులపై నిర్ణయం తీసుకోవడంలో స్పీకర్ పాత్రపై చాలాకాలంగా చర్చ జరుగుతోంది. శాసనసభ స్పీకర్ రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్నప్పటికీ, ఫిరాయింపు కేసులు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్న వాదన బలపడుతోంది. దానం నాగేందర్ కేసులో స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టు పక్కనపెట్టడం ఈ చర్చకు మరింత ప్రాధాన్యం తెచ్చింది. ఇకపై ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇదే ప్రమాణం వర్తించాలి. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తీసుకోవడం ద్వారా సంఖ్యాబలం పెంచుకోవడం రాజకీయ వ్యూహంగా భావించవచ్చు. కానీ ఎన్నికల తర్వాత ప్రజల తీర్పును పక్కనపెట్టి ప్రజాప్రతినిధుల బదిలీని సాధారణ రాజకీయ ప్రక్రియగా మార్చేస్తే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పు తుది న్యాయపరమైన పరిణామమా, తదుపరి న్యాయపోరాటం ఉంటుందా అన్నది వేరే విషయం. కానీ ప్రస్తుతానికి ఈ తీర్పు ఒక స్పష్టమైన రాజ్యాంగ సందేశాన్ని మాత్రం ఇచ్చింది.. ఎన్నికల్లో గెలిచిన పదవి వ్యక్తిగత ఆస్తి కాదు; అది ప్రజలు అప్పగించిన బాధ్యత. పార్టీ ఫిరాయింపులకు చట్టపరమైన పరిణామాలు తప్పవు అని. తెలంగాణలో ఇప్పటికే ఇతర ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కూడా అనర్హత పిటిషన్లు న్యాయస్థానాల పరిధిలో ఉన్నాయి. అందువల్ల దానం నాగేందర్ కేసు తీర్పు తదుపరి కేసుల్లో ఎలాంటి న్యాయపరమైన ప్రభావం చూపుతుందో చూడాల్సి ఉంది. రాజకీయాల్లో గెలుపోటములు సహజం. పార్టీలు మారడం ద్వారా అధికార సమీకరణాలు మారవచ్చు. కానీ ప్రజల ఓటు విలువ మాత్రం మారకూడదు. ఎన్నికల ఫలితాలను రాజకీయంగా మార్చుకునే స్వేచ్ఛకు, రాజ్యాంగం నిర్దేశించిన పరిమితులకు మధ్య గీత స్పష్టంగా ఉండాలి. అందుకే దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు తీర్పును ఒక వ్యక్తి రాజకీయ భవిష్యత్తుకు సంబంధించిన నిర్ణయంగా మాత్రమే కాకుండా, పార్టీ ఫిరాయింపుల సంస్కృతిపై రాజ్యాంగం, న్యాయవ్యవస్థ ఇచ్చిన గట్టి హెచ్చరికగా చూడాల్సిన అవసరం ఉంది.

## వివక్షను సరిచేసే ఆయుధం..

# రిజర్వేషన్!




**రిజర్వేషన్ స్వతంత్ర భారతదేశంలో ఒక్కసారిగా పుట్టుకొచ్చిన విధానం కాదు. కొందరు దాన్ని ఒక వర్గానికి ఇచ్చే ప్రత్యేక సౌకర్యంగా భావిస్తారు; మరికొందరు దాన్ని రాజ్యాంగపరమైన అవసరంగా సమర్థిస్తారు. అయితే రిజర్వేషన్ చరిత్రను అర్థం చేసుకోకుండా ఈ రెండు అభిప్రాయాలు కూడా అసంపూర్ణంగానే ఉంటాయి. విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, ప్రభుత్వ ఉద్యోగాలు, సామాజిక గౌరవం నుంచి తరతరాలుగా దూరం చేయబడిన వర్గాల దీర్ఘకాల పోరాటం నుంచి ఇది రూపుదిద్దుకుంది. హంటర్ కమిషన్ నుంచి మండల్ కమిషన్ వరకు సాగిన ప్రయాణం, అసమానతను గుర్తించడం నుంచి సామాజిక న్యాయానికి రక్షణలు కల్పించే దిశగా భారతదేశం ఎలా పయనించిందో , నేటి ఓబీసీ ఉద్యమం ఎందుకు ముఖ్యమైనదో కూడా ఈ చరిత్ర వివరిస్తుంది.**



**మహేశ్ గౌడ్**
రిసెర్చ్ స్కాలర్, ఐసీఎస్ఎస్ఆర్,
పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఉస్మానియా యూనివర్సిటీ

పంతొమ్మిదవ శతాబ్దపు భారతదేశంలో విద్య, వృత్తులు, ప్రజా ప్రదేశాలు, సామాజిక గౌరవం వంటి అనేక అంశాలపై కులం ప్రభావం చూపేది. తరువాత షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలుగా గుర్తించబడిన వర్గాలు పాఠశాలల్లో ప్రవేశం పొందలేకపోయేవి; వారిని తరతరాలుగా కొన్ని నిర్దిష్ట వృత్తులకే పరిమితం చేసేవారు. అనేక సామాజిక, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు కూడా పరిపాలన, ఉన్నత విద్యలకు దూరంగా ఉండేవి. వారి వెనుకబాటుతనం కేవలం పేదరికం వల్ల ఏర్పడింది కాదు. జన్మనే వ్యక్తి స్థాయి, సామర్థ్యాలకు కొలమానంగా భావించిన సామాజిక వ్యవస్థ దాన్ని నిర్మించింది. అందుకే సామాజిక న్యాయం కోసం వ్యక్తిగత కృషి మాత్రమే సరిపోలేదు. సంస్థాగత మార్పులు, ప్రజా విధానాలు అవసరమయ్యాయి. 1882లో ఏర్పడిన హంటర్ కమిషన్ విద్యలోని అసమానతను అధికారికంగా గుర్తించిన తొలి ముఖ్యమైన ప్రయత్నాల్లో ఒకటి. భారతదేశంలోని విద్యా పరిస్థితిని పరిశీలించిన ఈ కమిషన్ ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇచ్చింది. స్థానిక సంస్థల ద్వారా పాఠశాలలను విస్తరించడం, గ్రామీణ పాఠశాలలను పెంచడం, స్థానిక భాషల్లో బోధన అందించడం, ప్రజలకు విద్యను అందించడంలో ప్రభుత్వ బాధ్యతను పెంచడం వంటి అంశాలను అది సూచించింది. కులం కారణంగా ఏ వ్యక్తులు ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశానికి నిరాకరించకూడదనే సూత్రాన్ని కూడా అది సమర్థించింది. ఈ చర్చలో జ్యోతిరావు పూలే పాత్ర ప్రత్యేకంగా గుర్తించాలి. పూలే కేవలం మరిన్ని పాఠశాలలు కావాలని మాత్రమే కోరలేదు; అప్పటి విద్యా వ్యవస్థనే ఆయన ప్రశ్నించారు. అగ్రవర్ణాలకు విద్య అందిస్తే అది సహజంగానే ప్రజలందరికీ చేరుతుందనే భావనను ఆయన తిరస్కరించారు. విద్యలో ఆధిపత్యం కలిగిన వర్గాలు ప్రభుత్వ ఉద్యోగాలను తమకే పరిమితం చేసుకుంటారు కనుక, మహిళలు, రైతులు, అణగారిన కులాలు అవకాశాల నుంచి దూరమవుతున్నాయని ఆయన విమర్శించారు. హంటర్ కమిషన్‌కు సమర్పించిన తన ప్రతిపాదనలో, ప్రజలందరికీ ఉచిత, తప్పనిసరి ప్రాథమిక విద్య అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని పూలే చెప్పారు. పేద ప్రజలు కూడా పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుస్తున్నారు కాబట్టి, ప్రజా ఆదాయంతో విద్యను అందించాలని ఆయన వాదించారు. ముఖ్యంగా గ్రామీణ, అణగారిన వర్గాల్లోనే విద్య అవసరం ఎక్కువగా ఉందని భావించి ప్రాథమిక విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. తక్కువ కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలని, వ్యవసాయానికి ఉపయోగపడే ప్రాయోగిక విద్య అందించాలని, రైతు మరియు దిగువ కులాల నుంచి ఉపాధ్యాయులను నియమించాలని పూలే కోరారు. అలాంటి ఉపాధ్యాయులు వెనుకబడిన పిల్లల పరిస్థితిని బాగా అర్థం చేసుకుని వివక్షను తగ్గించగలరని ఆయన నమ్మారు. సావిత్రిబాయి పూలేతో కలిసి బాలికల విద్యకు కూడా ఆయన విశేష ప్రాధాన్యం ఇచ్చారు. పూలే జోక్యం హంటర్ కమిషన్ చర్చను ప్రజాస్వామ్య దిశగా మళ్లించింది. కొద్దిమంది ఉన్నత వర్గాలకు విద్య అందించడం నుంచి సమాజంలోని ప్రతి వర్గానికీ విద్య అందించాలనే దిశగా చర్చ మారింది. 1920ల చివరినాటికి న్యాయం కోసం సాగిన పోరాటం విద్యను దాటి రాజకీయ ప్రాతినిధ్యం వైపు మళ్లింది. బ్రిటిష్ భారతదేశంలో రాజ్యాంగ సంస్కరణలను పరిశీలించేందుకు సైమన్ కమిషన్ నియమించబడింది. అందులో భారతీయ సభ్యుడు లేకపోవడంతో దీనికి వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ, అణగారిన వర్గాల రాజకీయ స్థితిగతులపై చర్చకు ఇది వేదికగా మారింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అణగారిన వర్గాలకు శాసనసభల్లో, పరిపాలనలో సమర్థవంతమైన ప్రాతినిధ్యం అవసరమని వాదించారు. అధికారానికి దూరంగా ఉంచబడిన వర్గాలు ఆధిపత్య వర్గాల దయపై ఆధారపడలేవని ఆయన స్పష్టం చేశారు. తమ జీవితాలను ప్రభావితం చేసే చట్టాలు, విధానాలను రూపొందించడంలో భాగస్వామ్యం కల్పించే రక్షణలు వారికి అవసరమని ఆయన అన్నారు. సైమన్ కమిషన్ అణగారిన వర్గాలకు రిజర్వ్ చేసిన ప్రాతినిధ్యాన్ని సమర్థించినప్పటికీ, ప్రత్యేక నియోజకవర్గాల డిమాండ్‌ను అంగీకరించలేదు. ఈ చర్చ ద్వారా ఒక విషయం స్పష్టమైంది: సామాజిక న్యాయం అంటే వ్యక్తిగత పురోగతి మాత్రమే కాదు; రాజకీయ అధికార సంస్థల్లో సమాజంలోని అన్ని వర్గాలకు స్థానం కల్పించడం కూడా.. రాజకీయ రక్షణలపై జరిగిన చర్చ 1932లో పూణే ఒప్పందానికి దారితీసింది. బ్రిటిష్ కమ్యూనల్ అవార్డు అణగారిన వర్గాలకు ప్రత్యేక నియోజకవర్గాలను ప్రతిపాదించింది. అణగారిన వర్గాలు తమకు బాధ్యత వహించే ప్రతినిధులను తామే ఎన్నుకునే అవకాశం పొందుతాయని భావించి అంబేద్కర్ ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చారు. అయితే ప్రత్యేక నియోజకవర్గాలు హిందూ సమాజాన్ని విభజిస్తాయని మహాత్మా గాంధీ వ్యతిరేకించారు. చివరకు ప్రత్యేక నియోజకవర్గాల స్థానంలో ఉమ్మడి నియోజకవర్గాల్లో రిజర్వ్ చేసిన స్థానాలను ఏర్పాటు చేశారు. ప్రావిన్షియల్ శాసనసభల్లో అణగారిన వర్గాలకు కేటాయించిన స్థానాలు 71 నుంచి 148కు పెరిగాయి. విద్యా నిధులు, ప్రభుత్వ సేవల్లో సముచిత అవకాశాల గురించి కూడా ఒప్పందంలో ప్రస్తావించారు. ఇది ఒక రాజీ ఒప్పందం. అణగారిన వర్గాలకు హామీతో కూడిన ప్రాతినిధ్యం లభించినప్పటికీ, పూర్తి రాజకీయ స్వయం ప్రతినిధిత్వం లభించలేదు. అయినప్పటికీ, చారిత్రకంగా వెలివేయబడిన వర్గాలకు ప్రత్యేక రాజకీయ రక్షణలు అవసరమనే సూత్రాన్ని పూణే ఒప్పందం బలపరిచింది. స్వాతంత్ర్యం తరువాత రాజ్యాంగం ఈ పోరాటాలకు చట్టపరమైన, ప్రజాస్వామ్య పునాది కల్పించింది. ఆర్టికల్ 14 చట్టం ముందు సమానత్వాన్ని హామీ ఇస్తుంది. ఆర్టికల్ 17 అంటరానితనాన్ని రద్దు చేస్తుంది. ఆర్టికల్ 15(4) సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకునే అధికారాన్ని ప్రభుత్వానికి ఇస్తుంది. ఆర్టికల్ 16(4) తగిన ప్రాతినిధ్యం లేని వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించేందుకు వీలు కల్పిస్తుంది. ఆర్టికల్ 46 బలహీన వర్గాల విద్యా, ఆర్థిక ప్రయోజనాలను ప్రత్యేక శ్రద్ధతో ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తుంది. అసమాన పరిస్థితుల్లో ఉన్నవారిని ఒకే విధంగా చూడటం వల్ల ఎప్పుడూ న్యాయం జరగదు. మంచి వసతులున్న పాఠశాలలో చదివిన విద్యార్థి, సరైన సదుపాయాలు లేని గ్రామీణ పాఠశాలలో చదివిన విద్యార్థి ఒకే పరీక్ష రాసినా, వారి ప్రారంభ అవకాశాలు సమానంగా ఉండవు. ఈ అసమాన ప్రారంభ స్థితిని సరిచేయడానికి రిజర్వేషన్ ప్రయత్నిస్తుంది. ఇది ప్రతిభకు వ్యతిరేకం కాదు; ప్రతిభ పెరగడానికి అవకాశాలు అవసరమనే వాస్తవాన్ని గుర్తిస్తుంది. స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ఈ సూత్రాన్ని మండల్ కమిషన్ ముందుకు తీసుకెళ్లింది. 1979లో బి.పి. మండల్ అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిషన్ ఇతర వెనుకబడిన తరగతుల పరిస్థితిని అధ్యయనం చేసింది. సామాజిక, విద్యా, ఆర్థిక సూచికలను ఉపయోగించి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని సిఫారసు చేసింది. ఈ సిఫారసు 1990లో అమలు చేయబడింది. 1992లో ఇంద్రా సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు కొన్ని మార్పులతో దీనిని సమర్థించింది. అదే తీర్పు క్రీమీ లేయర్ సూత్రాన్ని ప్రవేశపెట్టి, సాధారణంగా రిజర్వేషన్లకు 50 శాతం పరిమితిని విడించింది. మండల్ కమిషన్ భారత ప్రజా జీవితాన్ని మార్చింది. ఓబీసీ ప్రాతినిధ్యాన్ని జాతీయ చర్చలోకి తీసుకువచ్చింది. స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన కుల అసమానత అంతరించిపోలేదని స్పష్టం చేసింది. అనేక వర్గాలు ఇప్పటికీ సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉన్నాయని గుర్తించింది. అందువల్ల ఓబీసీ ఉద్యమం కేవలం రిజర్వేషన్ కోసం మాత్రమే కాకుండా గౌరవం, గుర్తింపు, భాగస్వామ్యం, విద్య, ఉద్యోగాలు, అధికార సంస్థల్లో సముచిత వాటా కోసం అని గురుతుచేసింది.

కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యక్ష నియామకాల ద్వారా రిజర్వేషన్ ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీలకు 27 శాతంగా ఉంది. అయితే విధానంలో శాతం నిర్ణయించడం మాత్రమే సముచిత ప్రాతినిధ్యాన్ని నిర్ధారించదు. ఖాళీల సంఖ్య, నియామక విధానం, పెండింగ్ పోస్టులు, విద్యా అవకాశాలు, ఓబీసీ వర్గాల మధ్య ప్రయోజనాల పంపిణీ వంటి అంశాలు కూడా ప్రభావం చూపుతాయి. ఓబీసీలు తమకు రావాల్సిన వాటా పొందడం లేదనే ఆందోళనను విశ్వసనీయ గణాంకాల ఆధారంగా పరిశీలించాలి. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్య, పదోన్నతులు, ఖాళీలు, ప్రజా సంస్థల్లో ప్రాతినిధ్యం వంటి అంశాలపై సమగ్ర సమాచారం అవసరం. కులగణన, పారదర్శక రిజర్వేషన్ రోస్టర్లు, క్రమమైన సామాజిక ఆడిట్‌లు ఈ చర్చను మరింత వాస్తవికంగా, బాధ్యతాయుతంగా మార్చగలవు. రిజర్వేషన్ ఒక్కటే కుల అసమానతను అంతం చేయలేదు. నాణ్యమైన ప్రభుత్వ విద్య, స్కాలర్‌షిప్‌లు, వసతి గృహాలు, శిక్షణ, వివక్ష నిరోధక చర్యలు, పారదర్శక నియామకాలు కూడా అవసరం. రిజర్వేషన్ వర్గాల్లోని అత్యంత వెనుకబడిన సమూహాలకు ప్రత్యేక శ్రద్ధ ఇవ్వాలి. హంటర్ నుంచి మండల్ వరకు భారత సామాజిక న్యాయ ప్రయాణం విద్య, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాంగ రక్షణ, అనుకూల చర్యల ద్వారా సాగింది. ఈ కమిషన్లు, పూణే ఒప్పందం అసమానతను పూర్తిగా తొలగించకపోయినా, భారత ప్రజాస్వామ్య దిశను మార్చాయి. రిజర్వేషన్ దానం కాదు; ప్రతిభకు వ్యతిరేకం కూడా కాదు. ఇది చారిత్రక వివక్షను సరిచేసి రాజ్యాంగ సమానత్వాన్ని సార్థకం చేయడానికి ఉపయోగించే సాధనం. జన్మ ఆధారంగా విద్య, ఉద్యోగం, గౌరవం, రాజకీయ అధికారానికి అవకాశాలు నిర్ణయించబడుతున్నంతకాలం భారతదేశం సంపూర్ణ ప్రజాస్వామ్యమని చెప్పలేం. హంటర్ కమిషన్ ప్రారంభించిన, సైమన్ కమిషన్, పూణే ఒప్పందం, మండల్ కమిషన్ ద్వారా కొనసాగిన ఈ పని ఇంకా పూర్తికాలేదు. సముచిత ప్రాతినిధ్యాన్ని నిర్ధారించడం కేవలం రాజకీయ నిర్ణయం కాదు; అది నిరంతర రాజ్యాంగ బాధ్యత.

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.